తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శుక్రవారం
22 మే 2026
పేజీలు : 8
Follow :




# తెలంగాణ కార్మికులకు శుభవార్త..

- జూన్ 1 నుంచి పెరిగిన కనీస వేతనాలు అమలు..
- రాష్ట్రంలోని 1.11 కోట్ల మంది కార్మికులకు లాభం..
- సీఎం రేవంత్‌రెడ్డి

**గోదావరిఖని, జనంసాక్షి:**
తెలంగాణ రాష్ట్రంలోని కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ శుభవార్త ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఒక కోటి 11 లక్షల మంది కార్మికుల కనీస వేతనాలను పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. పెంచిన కనీస వేతనాలు జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మికులకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని అభినందించారు.

**కార్మికులను నాలుగు విభాగాలుగా వర్గీకరణ..**
రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ అనే నాలుగు విభాగాలుగా వర్గీకరించి కనీస వేతనాలను సవరించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. గతంలో అమలులో ఉన్న అర్బన్, రూరల్ అనే రెండు జోన్ల స్థానంలో ఇకపై మూడు జోన్ల విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని వేతనాలను నిర్ణయిస్తున్నట్టు చెప్పారు.

**పెరిగిన కనీస వేతనాల వివరాలు..**
అన్‌స్కిల్డ్ కార్మికుల కనీస వేతనం రూ. 12,750 నుంచి రూ. 16,000 వరకు.
సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ. 13,592 నుంచి రూ. 17,000 వరకు.
స్కిల్డ్ కార్మికుల వేతనం రూ. 13,072 నుంచి రూ. 18,500 వరకు.
హైలీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ. 14,607 నుంచి రూ. 20,000 వరకు పెంచినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పెంచిన వేతనాలు జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తాయని తెలిపారు.

**కార్మిక సంక్షేమంపై ప్రజా ప్రభుత్వానికి ప్రత్యేక దృష్టి..**
తెలంగాణ ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం కార్మికుల వేతనాల పెంపుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. దీని వల్ల రాష్ట్రంలోని కోట్లాది మంది కార్మికులు నష్టపోయారని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామిలతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి కార్మిక సంఘాలు, యాజమాన్యాలు, వివిధ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపిన అనంతరం ఈ



నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

**ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం..**
నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఇళ్ల అద్దెల భారం, జీవన వ్యయాలు పెరిగిన నేపథ్యం లో కార్మికుల సంక్షేమం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం తెలిపారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 1.11 కోట్ల మంది కార్మికులకు నేరుగా లాభం చేకూరుతుందని పేర్కొన్నారు.

**విదేశీ ఉపాధికి శిక్షణ-గల్ఫ్ కార్మికులకు రక్షణ..**
పలు రంగాల్లో స్కిల్డ్ లేబర్ కొరత ఉందని, విదేశాలకు వెళ్లాలనుకునే యువతకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని యోచిస్తున్నట్లు సీఎం తెలిపారు. కార్మికులు ఏజెంట్ల మోసాలకు గురికాకుండా ప్రభుత్వం అన్ని రకాల రక్షణ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. గల్ఫ్ దేశాల్లో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని, మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడమే కాకుండా బాధిత కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, త్వరలోనే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతో ప్రభుత్వం ముందుకు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## అక్టోబర్ 1, 2026 నాటికి ఓటర్ల తుది జాబితా అధికారిక ప్రచురణ

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



- 01.10.2026 నాటికి 18 ఏళ్లు నిండే వారందరికీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం
- జూన్ 25 నుండి జూలై 24 వరకు జిల్లా వ్యాప్తంగా బి.ఎల్.ఓ (బి ఎల్ ఓ)ల ద్వారా ఇంటింటి సర్వే
- జూలై 31న సవరించిన ముసాయిదా ఓటర్ల జాబితా (డ్రాఫ్ట్ రోల్) విడుదల
- సర్ కార్యక్రమం పై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్

వార్తా లోపలి పేజీలో

## అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిపై నేడు సమీక్ష

### 22 న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం

**కామారెడ్డి ప్రతినిధి, మే 21 (జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం ఈ నెల 22న నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ సమావేశం 22న శుక్రవారం ఉదయం 10.00 గంటలకు కామారెడ్డి పట్టణంలోని సత్య కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల పురోగతి, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయ మిత్రులు, శాఖల సిబ్బందినీ ఆహ్వానిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.



## జీడీకే.11వ గనిపై మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశం

- లక్ష్యాల సాధనకు సమన్వయంతో ముందుకు సాగాలి..
- ఆర్‌జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్..



**గోదావరిఖని, జనంసాక్షి:**
సింగరేణి సంస్థ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించడమే ప్రధాన ధ్యేయంగా, సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం ఏరియా-1 పరిధిలోని జీడీకే-11వ గనిలో గురువారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ డి. లలిత్‌కుమార్ హాజరై అధికారులకు, కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, కార్మిక సంక్షేమం,

మిగతా 3లో

## జిల్లాలో భానుడి భగభగ

### రెడ్ జోన్ గా రాజన్న సిరిసిల్ల జిల్లా..



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 21 (జనంసాక్షి)**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో భానుడి భగభగతో ప్రజలు తల్లడిల్లుతున్నారు. గత మూడు రోజుల నుండి జిల్లా వ్యాప్తంగా 45 డిగ్రీల సెన్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. ఉదయం 8 గంటలకే సూర్యుడితన ప్రతాపం చూపుతున్నాడు. వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు కూడా భానుడి ప్రతాపానికి ఇబ్బందులు పడుతున్నారు. రాజన్న ఆలయ ప్రధాన రహదారి, జాతర గ్రౌండ్, పోచమ్మ ఆలయం నుండి కోరుట్ల బస్టాండ్ వరకు వెళ్లే రహదారులపై మధ్యాహ్నం పూట జనాలు లేకపోవడంతో రోడ్లన్నీ కర్ఫ్యూను తలపిస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాను వాతావరణ శాఖ రెడ్ జోన్ గా ప్రకటించారు. జాతర గ్రౌండ్, రాజన్న ఆలయ పరిసర ప్రాంతాల్లో, భీమేశ్వర ఆలయ ప్రాంతాల్లోని చిరు వ్యాపారులు భానుడి ప్రతాపానికి మధ్యాహ్నం దుకాణాలు మూసి వేసుకుంటున్నారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కూడా భానుడి భగభగ లకు ప్రజలంతా ఇంటిలోనే గడుపుతున్నారు. సాయంత్రం పూట వేడి గాలులు వీచడంతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న వారం రోజులపాటు భానుడి ప్రతాపం ఇలాగే ఉండే సూచనలు కనిపిస్తున్నాయి.

# అక్టోబర్ 1, 2026 నాటికి ఓటర్ల తుది జాబితా అధికారిక ప్రచురణ

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి,మే 21(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజియన్ సార్) కార్యక్రమాన్ని చేపట్ చేపట్టి అక్టోబర్ 1, 2026 నాటికి ఓటర్ల తుది జాబితా అధికారిక ప్రచురణ చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ఓటర్ల జాబితాను పారదర్శకంగా, పక్కాగా రూపొందించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నిర్దేశిత షెడ్యూల్‌కు అనుగుణంగా ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. 01.10.2026 నాటికి 18 సంవత్సరాలు నిండే వారందరినీ అర్హులుగా పరిగణిస్తూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన తాజా షెడ్యూల్‌ను జిల్లా కలెక్టర్ వెల్లడించారు.జూన్ 15 నుండి జూన్ 24 వరకు అధికారులకు శిక్షణ, అవసరమైన ఫారాల ముద్రణ జరుగుతుందని, జూన్ 25 నుండి జూలై 24 వరకు సంక్షిప్తంగా నెల రోజుల పాటు బి.ఎల్.ఓలు జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తారని ఆయన వివరించారు.ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ ప్రకారం జూలై 24 లోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ ను పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం చేసి, జూలై 31న సవరించిన ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

ఈ ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణకు జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు గడువు ఉంటుందని, వచ్చిన క్లెయిమ్‌లు అభ్యంతరా లన్నింటినీ జూలై 31 నుండి సెప్టెంబర్ 28 లోగా పూర్తిగా పరిష్కరించి అన్ని ప్రక్రియలు ముగిసిన తర్వాత అక్టోబర్ 01, 2026 న ఓటర్ల తుది జాబితాను అధికారికంగా విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.జిల్లాలోని ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధి కారులు తహశీల్దార్లు ఈ షెడ్యూల్‌ను అత్యంత కచ్చితత్వంతో పాటించాలని కలెక్టర్ తెలిపారు. జూన్ 25 నుండి ప్రారంభం కాబోయే ఇంటింటి సర్వేలో బి.ఎల్.ఓలు ప్రతి ఇంటినీ సందర్శించి అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, మరియు మరణించిన లేదా వలస వెళ్లిన ఓటర్ల తొలగింపు ప్రక్రియను చేపట్టాలని సూచించారు. కొత్త సాంకేతిక ఐటీ విధానాలపై బి.ఎల్.ఓలు సూపర్వైజర్లకు తగిన శిక్షణ ఇవ్వాలని, అవసర మైన చోట కొత్త బి.ఎల్.ఓలను నియమించాలని అధికారులను ఆదేశించారు.అర్హులైన పౌరు లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కుని ఓటరు జాబితాలో తమ పేర్లను సరిచూసు కోవాలని, కొత్తవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# టీఆర్ఎస్ జెండా పండుగ బాధ్యుడిగా కొమురయ్య యాదవ్



**పెద్దపల్లి,మే 21(జనంసాక్షి)**
తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జెండా పండుగ వేడుకల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా ఇన్‌ఛార్జ్‌గా సలేంద్ర కొమురయ్య యాదవ్ నియమితులయ్యారు.పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మే 20 నుండి జూన్ 20 వరకు నెల రోజుల పాటు ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరణ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధిష్టానం ఈ నియామకం చేపట్టింది.ఈ క్రమంలోనే రాష్ట్రంలోని 33 జిల్లాలతో పాటు 119 శాసనసభ నియోజకవర్గాలకు రాష్ట్ర,జిల్లా స్థాయి పర్యవేక్షకులను ,బాధ్యులను పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియమించగా,పెద్దపల్లి జిల్లా బాధ్యతలను సలేంద్ర కొమురయ్యకు అప్పగించారు.తనపై ఎంతో నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు,తనకు సహకరించిన పార్టీ పెద్దలకు,నాయకులకు సలేంద్ర కొమురయ్య యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.తనకు ఇచ్చిన బాధ్యతలను పూర్తి శ్రద్ధతో నిర్వహిస్తూ,జిల్లాలోని పార్టీ నాయకులను, ఉద్యమకారులను కలుపుకొని సమన్వయంతో ముందుకు సాగుతానని ఆయన స్పష్టం చేశారు.ప్రతి గ్రామంలో పార్టీ జెండా గద్దెలను విజయ వంతంగా నిర్వహిస్తూ,జిల్లాలో తెలంగాణ రక్షణ సేన బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని కొమురయ్య యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

### హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి బాలికల

# ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- మే 21 నుండి మే 23 వరకు దరఖాస్తుల స్వీకరణ

**పెద్దపల్లి,మే 21(జనంసాక్షి) :**
హైదరాబాద్‌లోని బేగంపేట, రామాంతాపూర్ పబ్లిక్ స్కూల్స్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 1వ తరగతి (ఇంగ్లీష్ మీడియం) ప్రవేశాల కొరకు అర్హులైన ఎస్టీ బాలబాలికల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్రవేశాలకు సంబంధించి అర్హత ప్రమాణాలు అభ్యర్థి వయస్సు 01-06-2019 నుండి 31-05-2020 మధ్య జన్మించి ఉండాలి, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ. 2,00,000/-, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1,50,000/- మించకూడదని, ఒక కుటుంబం నుండి ఒక్కరికి మాత్రమే ప్రవేశానికి అర్హత ఉంటుందని, జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి, తహసీల్దార్, మున్సిపాలిటీ వారిచే జారీ చేయబడిన పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, సంబంధిత తహసీల్దార్ చే జారీ చేయబడిన ఆదాయ,నివాస,కులధృవీకరణ పత్రాలు,పాఠశాల నుండి తీసుకున్న ధృవీకరణ పత్రం,రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తో దరఖాస్తు ఫారములను,ఆసక్తి గలవారు కరీంనగర్ కలెక్టర్ కాంప్లెక్స్ లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం నందు పొందవచ్చు తెలిపారు.21, 2026 నుండి మే 23, 2026 సాయంత్రం 5:00 గంటల లోపు పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన పత్రాలతో కలిపి అక్కడే సమర్పించాల్సి ఉంటుంది. గడువు దాటిన అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు తిరస్క రించబడతాయని. జిల్లాలో 5 కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ఈ ప్రవేశం పొందిన బాలబాలికలకు హాస్టల్ ఉండదని, కమిషనర్ గారి ఆదేశాల ప్రకారం పెద్దపల్లి జిల్లాకు మొత్తం 5 సీట్లు కేటాయించడం జరిగిందని, లంబాడి వారికి: 2 సీట్లు, గోండు / నాయక్ పోడ్ వారికి: 1 సీటు, ఎరుకల వారికి1 సీటు,ఇతరులకు 1 సీటు కేటాయించడం జరిగిందని,మరిన్ని వివరాల కొరకు కరీంనగర్ కలెక్టర్ కాంప్లెక్స్, రెండవ అంతస్తులోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయ ఫోన్ నెంబర్ 9502664044 నందు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు సంప్రదించవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి ప్రాణదాతగా నిలిచినా తుమ్మ నిశాంత్



**సుల్తానాబాద్, మే 21 (జనంసాక్షి) :**
అఖిల్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రవం కాగా అత్యవసర చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని అర్కిడ్ హాస్పిటల్ కి తీసుకెళ్లగా చికిత్స నిమిత్తం పేషెంట్ కి ఏబీ నెగెటివ్ రక్తం ఎక్కించాలని డాక్టర్ చెప్పడంతో, పేషెంట్ కుటుంబ సభ్యులు డోనర్ కోసం వెతుకుతూ రక్తదాతల అనుసంధాన కర్త గాలిపేల్లి కుమార్ (కరీంనగర్) కి సమాచారం అందించారు. కుమార్ వెంటనే సుల్తానాబాద్ గాంధీ నగర్ కి చెందిన యువకుడు, సామజిక సేవకుడు తుమ్మ నిశాంత్కు సమాచారం తెలుపగ వెంటనే స్పందించి కరీంనగర్ బ్లడ్ బ్యాంక్ కి వచ్చి రీప్లేస్మెంట్ కింద తన బి పాజిటివ్ బ్లడ్ 18 వ సారి ఇవ్వడం జరిగింది.రక్త దానం చేసిన నిశాంత్ కు యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజు కుమార్ అభినందనలు తెలిపారు.దయచేసి రోడ్డు ప్రయాణం చేసే వారు జాగ్రత్తగా నడపండి, ఎదుటి వాళ్ళ తప్పు ఉన్న మన తప్పు ఉన్న ప్రమాదం జరిగినాకా చాలా బాధపడాల్సి వస్తాది. పేషెంట్ ఫోటోలు, వీడియో చూస్తే చాలా బాధగా అనిపించింది. అఖిల్ నువ్ తొందరగా కోలుకోవాలని ఆ భగవంతుణ్ణి మనస్ఫూర్తిగా కోరారు.



### కొనుగోలు కేంద్రాలలో రైతులకు

# కనీస సౌకర్యాలు కల్పించాలి

### తహసిల్దార్ కు వినతి పత్రం

**సుల్తానాబాద్,మే 21(జనంసాక్షి) :**
మండలంలో ధాన్యం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి సూచనల మేరకు సుల్తానాబాద్ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరి సంతోష్ కుమార్, గురువారం తహసీల్దార్ బషీరుద్దీన్ కువినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా కొనుగోలు ప్రక్రియలో అధికారులు, మిల్లర్లు కలిసి రైతులను "బి-కేటగిరి" పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రైతుల ధాన్యానికి తేమ శాతం పేరుతో అనవసర కోతలు విధించడం, "తాలు", "తరుగు" పేరుతో దోపిడీ చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాలలో తగిన టార్పాలిన్లు లేకపోవడంతో వర్షాలు వస్తే ధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి కొనసాగితే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కామని రాజేందరప్రసాద్, ప్రధాన కార్యదర్శి కోట నాగేశ్వర్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మెండే శంకరయ్య,యువ మోర్చా అధ్యక్షులు కొమ్మిడి రాజేందర్ రెడ్డి,మండల ఉపాధ్యక్షులు దాసరి వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో ప్రతి ఒక్కరు పాల్గొనే ప్రతిభ కనబరచాలి: మాజీ జిల్లా పరిషత్ సభ్యులు ఐల రమేష్



**సుల్తానాబాద్,మే 21(జనంసాక్షి) :**
క్రీడల్లో ప్రతి ఒక్కరు పాల్గొని ప్రతిభ కనబరచాలని మాజీ జిల్లా పరిషత్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐల రమేష్ అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్ కార్యక్రమంలో భాగంగా, నాలుగవ రోజు సుల్తానాబాద్ జూనియర్ కళాశాల గ్రౌండ్లో డిస్టిక్ యూత్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ పెద్దపల్లి ఆధ్వర్యంలో ఖోఖో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రైవేటు వైద్యులు,ఐల రమేష్ మాట్లాడుతూ, జీవితంలో క్రీడలు అనేది అత్యంత ఆవశ్యకమైనది ఆరోగ్యంగా ఉండడానికి రోజు ఏదో ఒక క్రీడాలలో పాల్గొనాలని పేర్కొన్నారు. క్రీడలకు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తుం దని, ప్రతి ఒక్కరు క్రీడలలో పాల్గొనాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్, కందునూరి ప్రకాష్ రావు,సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి, కౌన్సిలర్ లు శ్రావణి - రాకేష్, శోభ -శ్రీనివాస్,పెద్దపల్లి పేట సెక్రటరీ దాసరి రమేష్,ఖేలో ఇండియా కోకో కోచ్ గెల్లు మధుకర్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రణయ్, వెంకటేష్, కుమార్,అజ్జు,దుర్గాప్రసాద్ వాకర్స్ సభ్యులు,క్రీడాకారులు,తదితరులు పాల్గొన్నారు.

# జీడీకే.11వ గనిపై మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశం

గనుల్లో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలు, 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన ప్రణాళికలు, అలాగే సంస్థ ఎదుర్కొంటున్న మార్కెట్ పరిస్థితులపై సమగ్ర వివరాలు వెల్లడించారు.గనుల పనితీరు, నెలవారీ ఉత్పత్తి లక్ష్యాలు, బొగ్గు రవాణా, ఉత్పత్తి పెంపు చర్యలు తదితర అంశాలపై అధికారులు సుదీర్ఘంగా చర్చించారు.జీఎం డి.లలిత్‌కుమార్ మాట్లాడుతూ గనిలో ఎల్‌హెచ్‌డీ (ఎల్‌హెచ్‌డీ), ఎస్‌డీఎల్ (ఎస్‌డీఎల్), కంటిన్యూస్ మైనర్ (కంటిన్యూస్ మైనర్) వంటి ఆధునిక యంత్రాలతో పనులు జరుగుతున్నప్పటికీ, నిర్దేశిత స్థాయిలో 100 శాతం ఉత్పత్తి..ఉత్పాదకత సాధ్యంకావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యంత్రాల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించు కోవడం, ప్రణాళికాబద్ధంగా పని చేయడం ద్వారా లక్ష్యాలను తప్పకుండా సాధించాలని అధికారులకు, కార్మికులకు సూచించారు.



**ఉద్యోగులతో ముఖాముఖి సమావేశం..**

గని ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం ఉద్యోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులకు గనిలో ఎదురవుతున్న పలు సాంకేతిక, సామాగ్రి సమస్యలను జీఎం దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన జీఎం వారం రోజుల్లోగా అవసరమైన అన్ని రకాల సామాగ్రిని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే ఎల్‌హెచ్‌డీ, ఎస్‌డీఎల్, కంటిన్యూస్ మైనర్ యంత్రాలు నిర్దేశిత పని గంటల పాటు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై కార్మికులు స్పందిస్తూ, యంత్రాల నిర్వహణకు అవసరమైన పరికరాలు, విడిభాగాలు సమయానికి అందుబాటులో ఉంటే పూర్తి సమయం వెచ్చించి, పూర్తి సామర్థ్యంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఏజీఎం(ఐఈడీ) ఆంజనేయులు, ఏరియా ఇంజనీర్ రామ్మోహన్, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, అధికారులు రాజన్న, బ్రహ్మాజీరావు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రావణ్‌కుమార్, గని మేనేజర్ బి.మల్లేష్, పిట్ ఇంజనీర్ రాందాస్, సంక్షేమ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళులు..

**దేశానికి సాంకేతిక విప్లవానికి పునాది వేసిన మహనేత..**

**నగపాలక సంస్థ మేయర్ మహాకాళి స్వామి..**

**రామగుండం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోంది**

గోదావరిఖని, జనంసాక్షి:

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రామగుండం నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నివాళు లర్పించారు.ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో జీఎం కాలనీ చౌరస్తా వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు తెలిపారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశ రాజకీయాల్లో యువతకు కొత్త దిశానిర్దేశం చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు.రామగుండం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కల్వల లింగస్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్ ధూళికట్ట సతీష్, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హాజరై రాజీవ్ గాంధీకి నివాళులు అర్పించారు.

# వైశ్య భవన్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**సుల్తానాబాద్,మే 21(జనంసాక్షి) :**
స్థానిక వైశ్య భవన్ యందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 14 నుండి 18 సంవత్సరములు వయస్సు గల బాలికలకు మెప్మా మెడికల్ సిబ్బంది ఆధ్వర్యంలో స్క్రీనింగ్ టెస్టులు,బ్లడ్ టెస్టులు, రక్త హీనత (ఎనిమియ)గురించి అవగాహనా షుగర్,బీపీ,హైట్, వేయిట్ టెస్టులు నిర్వహించనైనది.హెచ్ పి వి వాక్సిన్ పై అవగాహన కార్యక్రమము నిర్వహించారు. కిషోర బాలికలు తీసుకోవలసిన ఆహారంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించనైనది. ఈ,కార్యక్రమంలో మున్సిపల్,చైర్మన్ బిరుదు రాధా కృష్ణ ,జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ గర్రెపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్,డాక్టర్ ఉదయ్ కుమార్ డాక్టర్ సింధూజ మెడికల్ సిబ్బంది కౌన్సిలర్లు,మున్సిపల్ కమిషనర్ రమేష్ తిప్పరాజు రమేష్, సీ.ఓ,ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పొలానికి నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తి

## - 50 ఎకరాల్లో మంటల బీభత్సం

**సుల్తానాబాద్,మే 21(జనంసాక్షి) :**
సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి పంట పొలానికి నిప్పంటించడంతో భారీ నష్టం సంభవించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మొదట చిన్నగా ప్రారంభమైన మంటలు ఎండల తీవ్రత, గాలుల వేగంతో ఒక్కసారిగా అదుపుతప్పి దాదాపు 50 ఎకరాల వ్యవసాయ భూమికి వ్యాపించాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.మంటలు వేగంగా వ్యాపించడంతో పొలాల సమీపంలోని సుమారు 20 బోరుబావులకు సంబంధించిన వైర్లు, మోటార్లు అగ్నికి ఆహుతయ్యాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడటంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్థానికులు, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామపంచాయతీ వాటర్ ట్యాంక్ సహాయంతో మంటలను అదుపు చేసేందుకు శ్రమించారు. తీవ్రంగా ప్రయత్నించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో మరింత నష్టం తప్పింది.ఈ ఘటనలో రైతులకు నష్టం వాటిల్లింది.బాధిత రైతులను ప్రభుత్వం గుర్తించి తక్షణమే నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని గ్రామ సర్పంచ్ గుడుగుల సతీష్ కోరారు. ఘటనపై అధికారులు విచారణ చేపట్టి, పొలానికి నిప్పంటించిన వ్యక్తిని గుర్తించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## దళితులను ఆలయంలోకి నిరాకరించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

**అరెస్టు చేయకపోవడంలో అంతర్యం ఏమిటి?: దళిత సంఘాల ఆగ్రహం**





**సుల్తానాబాద్,మే 21(జనంసాక్షి) :**
హలో శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో, రేణుక ఎల్లమ్మ బోనాల జాతర సందర్భంగా,దళితులను ఆలయంలోకి నిరాకరించి, దళిత మహిళలను దాదాపు 6 గంటల పాటు బోనం ఎత్తుకొని నిల్చున్న, వారిని దేవాలయంలోకి అడ్డుకొని, కుల వివక్ష చూపిన గౌడ కులస్తులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి మూడు రోజులు గడుస్తున్న, ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించాలని గురువారం దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలం లోని పెగడపల్లి గ్రామంలో సోమవారం గౌడ కులస్తులు నిర్వహించిన ఎల్లమ్మ బోనాల సందర్భంగా దళితులను ఆలయం లోకి రానీయకుండా అడ్డుకోవడం తీవ్ర వివక్షతకు నిదర్శనమని దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. ఈ సంఘటనపై గ్రామానికి చేరుకున్న దళిత సంఘాల ప్రతినిధులు బాధిత కుటుంబాలను పరామర్శించి సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులను కాలరాస్తూ దళితుల పట్ల కుల వివక్ష ప్రదర్శించడం అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామంలో జరిగిన ఘటనపై ఇప్పటికే కేసు నమోదు అయినప్పటికీ, ఇప్పటివరకు నిందితులను అరెస్ట్ చేయకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.వెంటనే కేసులో ఉన్న దాదాపు 20 మందిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.గ్రామంలో శాంతి భద్రతలు కాపాడుతూ బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో ఆది జాంబవ అరుంధతి రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి పాపయ్య, మహనీయుల ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొంకూరి కైలాసం,మాదిగ జాగృతి జిల్లా అధ్యక్షుడు ఏదుల శంకరయ్య ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాతంగి రేవంత్,సీనియర్ అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు న్యాతరి శ్రీనివాస్, జిల్లా నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యులు సంకెనపల్లి లక్ష్మణ్, వివిధ దళిత సంఘాల నాయకులు,మాదిగ సంఘ గ్రామ సభ్యులు పాల్గొన్నారు. సమావేశ అనంతరం సమావేశానంతరం పెద్దపల్లి డిసిపి భూక్య రామ్ రెడ్డిని దళిత సంఘాల నాయకులు బాధితులు కలిసి సంఘటన విషయంలో కేసు నమోదు అయిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరినట్లు తెలిపారు.

# ఎల్లయ్య చెరువులో ప్రధాన కాలువల పూడికతీత పనులు వేగవంతం

**బాన్సువాడ మే 20 (జనంసాక్షి)**
బాన్సువాడ పట్టణంలోని ఎల్లయ్య చెరువులో కొనసాగుతున్న ప్రధాన కాలువల పూడికతీత పనులను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది కలిసి పరిశీలించారు. చెరువులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. పూడికతీత ద్వారా తొలగించిన మట్టిని రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఉపయోగించు కోవాలని నాయకులు సూచించారు. ఈ పూడిక మట్టి పంట దిగుబడులను మెరుగుపరచడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా గృహ నిర్మాణం చేపట్టే వారు లేదా ఇతర అవసరాల కోసం ఖాళీ స్థలాలు కలిగిన వారు కూడా ఈ



మట్టిని జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో తీసుకెళ్లి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ప్రభుత్వం చేపట్టిన ఈ పూడికతీత పనుల వల్ల చెరువులో నీటి నిల్వ పెరగడంతో పాటు భూగర్భ జలాల స్థాయి కూడా మెరుగుపడుతుందని, ఇది పట్టణ ప్రజలకు మరియు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుస్తుందని నాయకులు అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాలేక్, కో–ఆప్షన్ సభ్యులు కాసుల రోహిత్, ఖామర్ మహమ్మద్ గౌస్, మున్సిపల్ సిబ్బంది సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# విజయవాడ కనక దుర్గమ్మ సన్నిధిలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డి

- అమ్మవారి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజల పై ఉండాలని ఆకాంక్ష
- రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యులతో అమ్మవారి దర్శనం
- ఎమ్మెల్యేను,కమిటీ సభ్యులను సాదరంగా ఆహ్వానించిన ఆలయ కమిటీ

**నిజామాబాద్ సిటీ మే 21 జనంసాక్షి :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై కమిటీ ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా గురువారం విజయవాడ కనక దుర్గమ్మ ఆలయాన్ని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి, కమిటీ చైర్మన్ డా.బిఎం వినోద్ కుమార్,వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డి తదితరులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే తో పాటు కమిటీ వారికి ఆశీర్వచనాలు అందించారు. అమ్మవారి చూపు తెలంగాణ రాష్ట్రం పై ఉండాలని ఆకాంక్షించారు. ఆ తల్లి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన ప్రజలకు సుభిక్ష పాలన అందించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, మెంబర్లు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు లతో పాటు మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయిరెడ్డి, రాష్ట్ర గీత కార్మిక సహకారం కార్పొరేషన్ చైర్మన్ చంద్ర శేఖర్ గౌడ్, ప్రొఫెసర్లు జునుగురు శ్రీనివాస్, విజయ్ కొర్రా, ప్రవాసీ ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నిరంతర సేవకు రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్న ఉపాధ్యాయుడు నిఖిల్ కుమార్

సిరికొండ మే 21 (జనం సాక్షి ).
సిరికొండ మండలానికి చెందిన తాళ్లరామడుగు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నిఖిల్ కుమార్ తన విధుల పట్ల చూపిన నిబద్ధతకు రాష్ట్రస్థాయి గుర్తింపు పొందారు. సంవత్సరం పాఠశాలలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా నిరంతరంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసినందుకు ఆయనకు ప్రత్యేక పురస్కారం అందజేశారు.హైదరాబాద్‌లోని దాశరథి ఆడిటోరియంలో నిర్వహించిన ఘన కార్యక్రమంలో మంత్రులు, ఉన్నతాధికారుల చేతుల మీదుగా నిఖిల్ కుమార్‌కు ఈ అవార్డు ప్రదానం చేశారు. పాఠశాలలో క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల అంకితభావం, సమయపాలనతో సేవలు అందిస్తూ ఉపాధ్యాయ వృత్తికి ఆదర్శంగా నిలుస్తున్నారని అధికారులు ప్రశంసించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బకారం రవి రాజ్ కుమార్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు నిఖిల్ కుమార్‌ను అభినందిస్తూ సన్మానం చేశారు. ఆయనకు లభించిన ఈ గౌరవం సిరికొండ మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు.



# మారుమూల తండాలకు వైద్యం చేరువలోకి అంకోల్ తండాలో ఉచిత కంటి వైద్య శిబిరం

**బాన్సువాడ మే 21 (జనం సాక్షి)**
బాన్స్వాడ నియోజకవర్గంలో నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్ తండా పంచాయతీ ఆవరణంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మరియు అంకోల్ తండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో, బోధన్ లైన్స్ క్లబ్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.
ఈ శిబిరానికి తండా సర్పంచ్ మంజుల బాబు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సునీల్ రాథోడ్ మాట్లాడుతూ, మారుమూల తండాలలో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకువస్తున్న లైన్స్ క్లబ్ సేవలను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో కూడా ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.కంటి వైద్యుడు అజయ్ మాట్లాడుతూ, ఈ శిబిరంలో సుమారు 180 మందికి పరీక్షలు నిర్వహించగా, అందులో 17 మందికి మోతి బిందు శస్త్రచికిత్స అవసరమని గుర్తించామని చెప్పారు. వారికి బోధన్ లైన్స్ క్లబ్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్యాంప్ డైరెక్టర్ హన్మంత్ రావ్, తండా ఉపసర్పంచ్ శ్రీచంద్ మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.



# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

**కామారెడ్డి ప్రతినిధి, మే 21 (జనంసాక్షి)**
జిల్లా కేంద్రంలోని నిజాం సాగర్ చౌరస్తా ప్రాంతంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ, యువతకు ఆయన ఒక ఆదర్శమూర్తి అని పేర్కొన్నారు.రాజీవ్ గాంధీ అతి చిన్న వయసులోనే ప్రధాన మంత్రి పీఠం అధిరోహించారని, యువత రాజకీయాలలో, ఇతర రంగాల్లో ముందుండాలని కోరుకునే వారని, దానికి అనుగుణంగానే ఓటు హక్కు వయసును 21 నుండి 18 సంవత్సరాలకు తగ్గించి యువతకు అవకాశలు కల్పించారని,అలాగే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో కొత్త ఒరవడులు సృష్టించి యువతకు ఉద్యోగ అవకాశలను కల్పించడంలో ముందున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు అలే మల్లికార్జున్,గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సందీప్,మాజీ డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావ్,కౌన్సిలర్లు అన్వర్, షేరు, రామ్మోహన్, గణేష్, సత్యం, సిద్దిక్, వాజిద్, అంజాద్, లడ్డు, సాయిలు, జావీద్, బబ్లు,మోతిలాల్, కో–ఆప్షన్ సభ్యులు గౌనె సునీత శ్రీనివాస్,మాజీ పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు,చాట్ల రాజేశ్వర్ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

కామారెడ్డి ప్రతినిధి, మే 21 (జనంసాక్షి)
జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పినీచారు., డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్,టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆద్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.




భారత రత్న, మాజీ ప్రధాన మంత్రి ×రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా డిసిసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పినీచారు. జిల్లా డిసిసి అధ్యక్షులు ×ఏలే మల్లికార్జున్, టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అనంతరం మాట్లాడుతూ× దేశ అభివృద్ధికి దూరదృష్టితో పనిచేసిన మహానేతగా రాజీవ్ గాంధీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. యువతకు సాంకేతిక విప్లవాన్ని అందించిన నాయకుడిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ కౌన్సిలర్లు, టౌన్ అధ్యక్షులు, అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సిద్దాపూర్ లో గ్రామపంచాయతీ, మహిళా మండలి నిర్మాణ పనులు ప్రారంభం



**బోధన్, మే 21 ( జనంసాక్షి ) :**
బోధన్ మండలం సిద్దాపూర్ గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ భవనం మహిళా మండలి భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ మేరకు భవనాలకు సంబంధించిన మార్కు వేసి గుత్తేదారు షకీల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతి గ్రామానికి గ్రామపంచాయతీ తో పాటు మహిళా మండలి మౌన నిర్మాణానికి నిధులను మంజూరు చేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. పంచాయతీ భవనాలకు 20 లక్షలు మహిళా మండలికి పది లక్షల చొప్పున నిధులు మంజూరు అయ్యాయని అందువల్ల పనులను నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ గ్రామ సర్పంచ్ గంగాసాగర్ విఠల్, పంచాయతీ కార్యదర్శి ప్రణవ్, పంచాయతీరాజ్ ఎఈ లిఖిత, కల్దుర్కి సహకార సంఘం చైర్మన్ గింజుపల్లి శరత్, మాజీ సర్పంచ్, గుత్తేదారు సాలూర షకీల్, మహిళలు పాల్గొన్నారు.

## బోయినపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ అడ్మిషన్లు



**బోయినపల్లి, మే 21 (జనంసాక్షి)**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ తెలిపారు.కోర్సులు ఎంపీసీ 40, బైపీసీ 40 సీఈసీ 40 ఏసీఈ అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఎస్సెస్సీ మెరిట్, ప్రభుత్వ రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది అని అన్నారు.దరఖాస్తు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తుకు చివరి తేదీ మే 25. అని ఎంపికైన వారి జాబితా మే 27 న ప్రదర్శన, మే 28 నుంచి 30 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, ప్రవేశాలు ఉంటాయి.తెలిపారు.ఇటీవలి ఈఏపీసెట్ ఫలితాల్లో ఐదుగురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని, గతంలో ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి 8వ ర్యాంక్ సాధించిన ఘనత ఈ సంస్థకు ఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య, పుస్తకాలతో పాటు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, అన్‌అకాడమీల ద్వారా జేఈఈ, ఈఏపీసెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తామన్నారు. బాలికలకు ఉచిత హాస్టల్ వసతితో పాటు ఇంటర్‌తో పాటే ఐటీ, మీడియా, బ్యూటీ రంగాల్లో వృత్తిపరమైన సర్టిఫికెట్ కోర్సులు ఉంటాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## లస్మన్నపల్లిలో రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలు

**సైదాపూర్ మే 21 (జనంసాక్షి)**
సైదాపూర్ మండల పరిధిలోని లస్మన్నపల్లి గ్రామంలో గురువారం రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మ్యాకల స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ యువతకు 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీదేనని పేర్కొన్నారు. ప్రధానిగా దేశ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు "రాజీవ్ గాంధీ అమర్ హై" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ బైరి రాజు, ఉప సర్పంచ్ అందే రాకేష్, వార్డు సభ్యులు పెసరి లత, మొలుగూరి భారతి, మ్యాదరి రాధ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెసరి తిరుపతి, మారం నారాయణరెడ్డి, పాల్సాని పాపిరెడ్డి, మెరుగు నరేష్, కీర్తి భూమయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## తడగొండలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

**కూలీలకు మజ్జిగ, పండ్ల పంపిణీ**

**బోయినిపల్లి, మే 21 (జనంసాక్షి)**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలో మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ మాట్లాడుతూ.. భారతదేశాన్ని సాంకేతిక రంగంలో ప్రపంచ దేశాల సరసన నిలబెట్టిన ఘనత రాజీవ్ గాంధీదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, స్థానిక సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు నల్ల మోహన్, జంగం అంజయ్య, బొంగోని వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అద్దంకి రమేష్, గుడి శ్రీనివాస్ రెడ్డి, ఎండి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలి

**బిజెపి మండల అధ్యక్షులు దంచనాల శ్రీనివాస్**

**తాసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు**

**సైదాపూర్ మే 21( జనంసాక్షి)**
సైదాపూర్ మండలంలో కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలని బిజెపి మండల అధ్యక్షులు దెంచనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక తాసిల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్ వినతిపత్రం అందజేశారు మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, తరుగు పేరుతో ఇష్టానుసారంగా కటింగ్ వ్యవస్థను అరికట్టాలని, రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలును వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీసం సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా కొనుగోలు చేసిన రైతులకు వెను వెంటనే అకౌంట్లో డబ్బులు వేయగలరని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాముల పల్లె గ్రామ సర్పంచ్ అనుమండ్ల రాంరెడ్డి, బిజెపి నాయకులు కొల్లిపాక తిరుపతి కందిమల్లరెడ్డి పోతురాజు సుధాకర్, మెరుగు శ్రీనివాస్ మునిపల్ అశోక్, శ్రీనాథ్ రాజేశ్వరరావు మధుకర్ యాదగిరి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు





## తరుగు లేకుండా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

### తహశీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం

**బోయినపల్లి, మే 21(జనం సాక్షి)**
మండలంలో నెలరోజులుగా కల్లాల్లోనే ఉన్న వరి ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ బోయినపల్లి మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశు రామ్ మాట్లాడుతూ.కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు వ్యవస్థ పూర్తిగా గాడితప్పిందని విమర్శించారు. రైస్ మిల్లర్లు, దళారులు, అధికారులు కుమ్మక్కై 'తాలు?తరుగు' పేరుతో క్వింటాకు 6 నుంచి 8 కిలోల వరకు అక్రమ కోతలు విధిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో కోతలు లేవంటూ ప్రకటనలకే పరిమితమయ్యారని, రైతుల బాధలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తరుగు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, మెరుపుల గంగాధర్ గౌడ్, రాజేంద్రప్రసాద్, మిరియాల శరత్ చంద్రారెడ్డి, కొంకటి హరీష్, చిలుముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మన్ పల్లి లో ఉపాధి హామీ పనులను పరిశీలించిన సాలూర ఎంపీడీవో శ్రీనివాస్



**బోధన్, మే 21 (జనంసాక్షి ) :**
సాలూర మండలం కుమ్మన్ పల్లి గ్రామంలోని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను గురువారం సాలూర ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం కూలీలతో ఎంపీడీవో ముచ్చటించారు. ప్రస్తుత ఎండాకాలంలో దృష్టిలో పెట్టుకొని కూలీలకు తాగునీటి వసతి కల్పించాలని, నీడ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అలాగే కూలీలకు డబ్బులను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలో 10 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మహిళా మండలి భవన నిర్మాణ పనులను, అంగన్వాడి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్ ను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను తనిఖీ చేయడం జరిగింది. ఎంపీడీవో వెంట సర్పంచ్ శీలం మహేందర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు ఉన్నారు.



## సాలూరలో కొనసాగుతున్న హరినామసప్తః

**బోధన్, మే 21 ( జనంసాక్షి ) :**
సాలుర మండల కేంద్రంలో ఈ నెల 18వ తేదీ నుండి ప్రారంభమైన హరినామ సప్తహ విజయవంతంగా కొనసాగుతుంది. గ్రామంలోని మహిళలు మంగళ హారతులతో సప్తహ వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నా పద్దా అనే తేడా లేకుండా గ్రామంలోని ప్రజలు అధిక సంఖ్యలో హరినామ సప్తహకు చేరుకొని స్వామివారి సన్నిధిలో గడిపారు. హరినామ సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది.

# సహజ వనరులను దోచుకుంటున్న రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్

- ❑ కోర్టు స్టే ఉన్నప్పటికీ అధికార గర్వంతో అక్రమ పనులు..
- ❑ రచ్చగుట్ట మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు..
- ❑ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి..



**అంతర్గం, జనంసాక్షి:** మండలంలోని పెద్దంపేట గ్రామ శివారులో ఉన్న రచ్చగుట్ట నుండి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని,దీనికి రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ సహకరిస్తున్నాడని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆరోపించారు.ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన గురువారం మట్టి తవ్వకాలు జరుగుతున్న రచ్చగుట్ట పరిసరాలను పరిశీలించారు. ఈ గుట్టపై ఎలాంటి తవ్వకాలు జరపవద్దని కోర్టు స్టే ఉన్నప్పటికీ ప్రభుత్వ అండదండలతో ఎమ్మెల్యే ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తున్నాడని విమర్శించారు.గతంలో లింగాపూర్ సమీపంలో ఉన్న గుట్టను సైతం మట్టిని అక్రమంగా తరలించారని గుర్తు చేశారు. ప్రస్తుతం మట్టి తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.లారీల ద్వారా అక్రమంగా తరలిస్తూ రోడ్డు విస్తరణ పనులకు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు.ఇప్పటికే రూ.20 కోట్ల విలువ చేసే మట్టిని దౌర్జన్యంగా తరలించారని అన్నారు.ఈ విషయంలో కనీసం మైనింగ్ అధికారులు,గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సహజ వనరులు దోచుకోవడం వల్ల భవిష్యత్తులో పర్యావరణానికి పెనుముప్పు తయారవుతుందని అన్నారు.గ్రామ అభివృద్ధికి, ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించాల్సిన ప్రజాప్రతినిధులు అక్రమంగా సహజ వనరులను దోచుకోవడం సరైన విధానం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని..లేదంటే లీగల్‌గా కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.అధికారం అడ్డం పెట్టుకొని అక్రమాలకు పాల్పడితే ఊరుకునేది లేదని, భవిష్యత్తులో ప్రజలే గుణపాఠం చెప్తారని అన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రానున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని,ప్రజలు, రైతులు అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు.ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ గ్రామ సర్పంచ్ ఆముల పెద్ద శ్రీనివాస్, ఉప సర్పంచ్ కరివేద స్రవంతి-శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొలిపాక శరణ్య-మధుకర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు పుట్ట శ్రీనివాస్‌యాదవ్, గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు మెరుగు రమేష్ గౌడ్, బండి మహేష్‌గౌడ్, కోల మధుకర్ పటేల్, గోలి ప్రకాష్, గుడి రమేష్‌రెడ్డి, తరుణ్, జాహెద్ పాషా, అల్లి గణేష్, కదర్ల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# టిఆర్ఎస్ జెండా పండుగ జిల్లా ఇంచార్జీ మజీద్ నియామకం



**ఎల్లారెడ్డిపేట, మే 21, (జనంసాక్షి) :** తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) జెండా పండగ కార్యక్రమం ఈ నెల20 నుండి ప్రారంభం అవ్వగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ఇంచార్జీలను టిఆర్ఎస్అధినేత కల్వకుంట్ల కవిత బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేయగా సిరిసిల్ల జిల్లాకు ఇంచార్జీగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మజీద్‌ను నియమించారు. రాష్ట్ర అబ్జర్వర్‌గా కొంగరి ధరణి రాణి, సిరిసిల్ల వేములవాడ నియోజకవర్గ అబ్జర్వర్లుగా గంగొల్ల రంజిత్, ఈతరి మారయ్యలు వ్యవహరించనున్నారు. వేములవాడ నియోజవర్గ ఇంచార్జీలుగా వరద సతీష్, సుధాకర్ శర్మ, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీలుగా గుంటుక సంపత్, భూస వేణులకు బాధ్యతలు అప్పగించారు. టిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత తమందరిపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందున జెండా పండుగలు విజయవంతం చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రజలు కవితక్క, నాయకత్వాన్ని కోరుకుంటున్నారని,పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం కవితక్క పేద్దపీట వేయడం జరుగుతుందన్నారు. ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగాలు -ఉపాధి, రైతే రాజు - ఉచిత కరెంటు, సామాజిక న్యాయం దిశగా తెలంగాణ రక్షణసేన పని చేస్తుందని, టిఆర్ఎస్‌లో చేరడానికి చాలమంది ముందుకు రావడం జరుగుతుందని అన్నారు.

# కార్పొరేట్ మెడికల్ బోర్డును వెంటనే నిర్వహించాలి..




**గోదావరిఖని, జనంసాక్షి:** సింగరేణి వ్యాప్తంగా కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను మెడికల్ బోర్డు నిర్వహించకుండా గత కొంతకాలంగా నిర్లక్ష్యం జరుగుతుందని, గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో సింగరేణి యాజమాన్యం వరుసగా బోర్డు సమావేశాలు నిర్వహించి వేలాది మంది కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత మెడికల్ బోర్డు నిర్వహణలో జాప్యం జరుగుతుందన్నారు.గత మెడికల్ బోర్డులో అనేకమందిని నిరాశపర్చిందన్నారు.సింగరేణి యాజమాన్యం అనారోగ్యంతో ఉన్న వారిని..సర్వీసులో కొనసాగ లేని వారిని మెడికల్ బోర్డులో ఇన్వాలిడేషన్ ఇచ్చి గతంలో లాగానే సింగరేణి వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.జీడీకే.2ఏ గని కార్మికులను జీఎల్‌బీకేఎస్-ఐఎఫ్‌టీయూ నాయకులు ఇ.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఐ.కృష్ణ,ఇ.నరేష్, ఎస్.ప్రసాద్,మల్లేష్.కొమురయ్య,రాజయ్య,శేఖర్ తదితరులు ఉన్నారు.



# పెన్షన్ లబ్ధిదారుల ఇండ్ల వద్ధనే ఈ కే వై సీ - దివ్యాంగుల సేవలో సర్పంచ్ రమాదేవి

**ఎలిగేడు,మే 21(జనంసాక్షి) :** మండలం లోని ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో గురువారము చేయూత పథకం కింద పెన్షన్ పొందుతున్న లబ్దిదారుల ఈ కే వై సీ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుంది. గ్రామ సర్పంచ్ మద్ధెల రమాదేవి సంపత్ ,గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ నేరుగా లబ్దిదారుల ఇండ్లకు వెళ్లి ఫేస్ రికగ్నేషన్ ద్వారా ఈ కే వై సీ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. వేసవి కాలం ఎండలు మండుతున్న నేపథ్యంలో లబ్దిదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా స్వయంగా లబ్దిదారుల ఇండ్ల వద్ధకే వెళ్లి ఈ కే వై సీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రమాదేవి సంపత్ తెలిపారు.జూన్ 15 లోపు పెన్షన్ పొందుతున్న ప్రతి లబ్దిదారులు తప్పని సరిగా ఈ కే వై సీ చేయించుకోవాలని కోరారు.

# బక్రీద్ పండుగకు భద్రతా చర్యలను కట్టుదిట్టం

## రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ..



**గోదావరిఖని, జనంసాక్షి:** బక్రీద్ పండుగ సందర్భంగా శాంతి భద్రతలను పరిరక్షించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్టు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో అర్ధరాత్రి బసంత్‌నగర్ టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను పోలీస్ కమిషనర్ స్వయంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని,అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. అక్రమ రవాణా,నిషేధిత వస్తువుల తరలింపు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. పండుగల సమయంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకునేలా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు.ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అనుమానాస్పద అంశాలపై వెంటనే సమాచారం అందించాలని కోరారు.

# ఉపాధి హామీ కూలీలను కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హరీష్‌రెడ్డి

## కూలీలకు టవల్స్, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ..



**అంతర్గాం, జనంసాక్షి:** అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామ శివారు రామస్వామి కుంట చెరువులో పూడికతీత పనులు నిర్వహిస్తున్న కూలీలను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి ఆత్మీయంగా కలిశారు. వేసవి అధిక ఉష్ణోగ్రతలో వారు చేస్తున్న పనులను పరిశీలించారు.జీవనోపాధి, వేతనాలు, సంరక్షణ చర్యల గురించి మహిళ కూలీలను అడిగి తెలుసుకున్నారు.వేసవిలో ఉపాధి హామీ పనులను మధ్యాహ్నంలోపు వీలైనంత త్వరగా ముగించాలని కూలీలకు సూచించారు.అనంతరం 250 మందికి టవల్స్ పంపిణీ చేశారు.అదేవిధంగా ఎండవేడికి దాహార్తి తీర్చేందుకు 500 మజ్జిగ పాకెట్లను స్వయంగా కూలీలకు అందజేశారు. అంతేకాకుండా వారితో కలిసి కొద్దిసేపు ఉపాధి హామీ పనులను చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆముల పెద్ద శ్రీనివాస్, ఉప సర్పంచ్ కరివేద స్రవంతి-శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొలిపాక శరణ్య-మధుకర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పుట్ట శ్రీనివాస్‌యాదవ్, గౌడ సంఘం మాజీ అధ్యక్షులు మెరుగు రమేష్‌గౌడ్, గౌడ్ సంఘం మాజీ ఉపాధ్యక్షులు బండి మహేష్‌గౌడ్, కోల మధుకర్, గోలి ప్రకాష్, తరుణ్, జాహెద్ పాషా,అల్లి గణేష్, కదర్ల శ్రీధర్,గ్రామస్తులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్,లో కిశోర బాలికల ఉచిత ఆరోగ్య శిబిరాలు: డీఎంహెచ్ఓ డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ తనిఖీ

**సుల్తానాబాద్,మే 21(జనంసాక్షి) :** కిశోర బాలికల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా మెప్మా ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్.ఎచ్.జి. గ్రూప్ సభ్యుల పిల్లలు అయిన కౌమార దశ బాలికలకు ప్రత్యేక ఆరోగ్య స్క్రీనింగ్ శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.సుల్తానాబాద్‌లోని వాసవి భవన్‌లో నిర్వహించిన కిషోర బాలికల ఆరోగ్య శిబిరానికి కూడా ముఖ్య అతిథిగా హాజరై వైద్య సేవలను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, కిశోర బాలికల్లో వచ్చే శారీరక మార్పులు, ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను



ముందుగానే గుర్తించడానికి ఈ శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ శిబిరాల్లో హిమోగ్లోబిన్, ఆర్ బి ఎస్, బి. ఎం . ఐ. వంటి పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షల అనంతరం వచ్చే రిపోర్టుల ఆధారంగా బాలికలకు అవసరమైన తదుపరి వైద్య చికిత్సలు, మందులను ఉచితంగా అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.ఇదే వేదికగా బాలికలకు ఋతుక్రమ పరిశుభ్రత పై ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రతి కిశోర బాలిక వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత వంటి సమస్యల నుండి బయటపడవచ్చని వైద్యులు అవగాహన కల్పించారు.

**- అధికారులు, సిబ్బంది :**

పెద్దపల్లి మున్సిపాలిటీలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ స్ఫూర్తి, డాక్టర్ సౌమ్యలతో పాటు ఇతర వైద్య, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. సుల్తానాబాద్ వాసవి భవన్‌లో జరిగిన శిబిరంలో డాక్టర్ ఉదయ్, స్థానిక వైద్య బృందం మెప్మా సిబ్బంది, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, కౌన్సిలర్లు వరప్రదీ ప్, గాజుల రాజమల్లు, నాయకులు అబ్బయ్య గౌడ్, రాకేష్ కందునూరి కుమార్, సూపర్వైజర్ రోజా, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను మూసివేయాలి

## ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి : ఎస్ ఎఫ్ ఐ డిమాండ్



**కరీంనగర్ టౌన్, మే 21, (జనంసాక్షి)** ఈరోజు ఎస్ ఎఫ్ ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఏడి మాధవి గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, కరీంనగర్ పట్టణంలో అనుమతి లేకుండా అనేక ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభమవుతున్న పరిస్థితి తీవ్ర ఆందోళనకరమని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతున్నాయని విమర్శించారు.ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి, అక్రమ ఫీజు వసూళ్లను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థికి అందు బాటులో ఉండే నాణ్యమైన విద్యను ప్రభుత్వం హామీ ఇవ్వాలని కోరారు. అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశా లలను గుర్తించి వెంటనే మూసివేయాలని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ఇలాంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఒకే రిజి స్ట్రేషన్‌తో అనేక బ్రాంచీలు నడుపుతున్న పరిస్థితి కరీంనగర్‌లో పెరుగుతున్నదని, వాటిని తక్షణమే మూసివేయాలని ఆయన అన్నారు. అలాగే కరికులం, ఒలింపియాడ్, వరల్డ్, ఎక్స్‌ప్లోర్, యూనివర్సల్ వంటి పేర్లను నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగి స్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్పొరేట్ విద్యను నియంత్రిస్తామని చెప్పినప్పటికీ, ప్రస్తుతం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం వెంటనే విద్యా వ్యవస్థలో నియంత్రణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకుని అనుమతి లేని పాఠశాలలను పర్యవేక్షించి మూసివేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, సహాయ కార్యదర్శి బొగేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు రోహిత్, సందేశ్, సన్నీ, రాకేష్, మానస, నాయకులు రోహిత్, మనోజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# దోస్త్ మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు మే 23 లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలి

## మే 25 వరకు దోస్త్ రెండో విడత రిజిస్ట్రేషన్లు..



**కరీంనగర్ టౌన్, మే 21,(జనంసాక్షి)** దోస్త్ మొదటి విడతలో సీట్ల కేటాయింపు పొందిన విద్యార్థులు తప్పనిసరిగా మే 23 లోగా ఆన్లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఎస్.ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) కరీంనగర్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ మరియు అడ్మిషన్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. సురేందర్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ దోస్త్ వ్యక్తిగత లాగిన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ ప్రక్రియ పూర్తి చేయకపోతే కేటాయించిన సీటు రద్దు అవుతుందని వారు తెలియజేశారు. అదేవిధంగా దోస్త్ రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగు తోందని, విద్యార్థులు మే 25 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ మే 26 వరకు కొనసాగుతుందని, మే 30న రెండో విడత సీట్ల కేటాయింపు జరుగుతుందని దోస్త్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్. రామకృష్ణ వివరిం చారు. ఈ సందర్భంగా కళాశాలలో అందు బాటులో ఉన్న ఆధునిక మరియు ఉద్యోగో పయోగ కోర్సుల వివరాలను వెల్లడించారు. బీఎస్సీ హెల్త్ కేర్, బీకాం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బి.ఎఫ్.ఎస్.ఐ), బీకాం రిటైల్ ఆపరేషన్స్ వంటి అధునాతన ఏఈడిపి కోర్సులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అలాగే బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటు డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్ వంటి ఆధునిక సబ్జెక్టులు బోధిం చబడుతున్నా యని పేర్కొన్నారు. బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీతో పాటు ఫుడ్ సైన్స్, మెడికల్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, క్రాప్ ప్రొడక్షన్, ఫిషరీస్, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, కంప్యూ టర్ సైన్స్ వంటి సబ్జెక్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బీకాంలో కంప్యూ టర్ అప్లికేషన్స్, ఫైనాన్స్, బిజినెస్ అనలి టిక్స్ కోర్సులు, బీబీఏ మరియు బీఏలో స్పెషల్ కోర్సు మరియు హిస్టరీ, ఎకనా మిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మిని స్ట్రేషన్‌తో పాటు కంప్యూటర్ అప్లికేషన్స్, జాగ్రఫీ, సైకాలజీ, జర్నలిజం వంటి మూ క్స్ సబ్జెక్టులు బిఏ ఇంగ్లీష్ మరియు తెలుగు మాధ్యమాల్లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.విద్యార్థులు దోస్త్ ద్వారా ఎస్.ఆర్.ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కరీంనగర్ (అటానమస్)లో ప్రవేశాలు పొందాలని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది కోరారు.



# ఘనంగా రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలు

**ఎల్లారెడ్డిపేట, మే 21, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామ బస్టాండ్ వద్ద గురువారం రాజీవ్ గాంధీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎస్ కే సాహెబ్ ఆధ్వర్యంలో ఈ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. దేశ సాంకేతిక రంగానికి, యువతకు రాజీవ్ గాంధీ చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ముషకం దత్తాద్రి గౌడ్, చేపూరి రాజేశం గుప్తా, ముద్రకోలా సాయి ప్రేమ్, గుర్రాల రాజిరెడ్డి, జనార్ధన్, చల్ల పద్మరెడ్డి, అందె బాలయ్య, దాసరి శ్రీనివాస్, వార్డ్ సభ్యులు అందె చంద్రం, గుర్రాల సత్తిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్‌లో చేపలు పట్టడానికి వెళ్లి జారి పడి మత్స్యకార్మికుడి మృతి



**ఎల్లారెడ్డి పేట, మే 21, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డి పేట మండలం లోని రాచర్ల తిమ్మా పూర్ గ్రామానికి చెందిన భీమరి సత్తయ్య (56) అనే మత్స్య కార్మికుడు బుధవారం రాత్రి చేపలు పట్టడానికి వెళ్లుతూ చెరువు సమీపంలో జారీ కిందపడి మృతిచెందిన సంఘటన గ్రామంలో విషాద సంఘటన చోటుచేసుకుంది. మత్స్య కార్మికుడు చేపలను పట్టుకొనిఅమ్ముకుంటు తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రతిరోజులా చేపలు పట్టడానికి వెళ్లిన సత్తయ్య జారిపడి మృతిచెందాడు. మృతునికి భార్య సత్తవ్వ, కుమారుడు బాబుల్ ఉన్నారు. మత్స్యకార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎల్లారెడ్డిపేట పోలీసులు శవపంచనామ చేసి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

## ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్ బి.ఎస్ లత

**మల్యాల మే 20 (జనంసాక్షి)** మల్యాల మండల కేంద్రంలోని,మానల గ్రామం లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత ఆకస్మికంగా పరిశీలించారు.కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు.ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం,నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ట్రక్ షీట్ నమోదు,ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని,ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో స్వాతి,ఆర్ఐ తిరుపతి,రాణి సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది,కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# బాపూజీ నగర్‌కు చెందిన వ్యక్తి అనుమానాస్పద మృతి..

## కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన గోదావరిఖని పోలీసులు..



**గోదావరిఖని, జనంసాక్షి :** గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపూజీ నగర్‌కు చెందిన రావులపల్లి రాధాకృష్ణ (42) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాధాకృష్ణ వృత్తిరీత్యా పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే గత ఐదు సంవత్సరాలుగా కుటుంబ కలహాల కారణంగా భార్యతో వేర్వేరుగా నివసిస్తున్నట్లు సమాచారం. కుటుంబ సమస్యల కారణంగా మానసికంగా కలత చెందిన రాధాకృష్ణ, క్రమంగా మద్యానికి బానిసై సాధారణ జీవన విధానానికి దూరమైనట్లు స్థానికులు తెలిపారు.భార్య దూరమైన తర్వాత ఆయన ఎలాంటి స్థిరమైన ఉపాధి లేకుండా ఎక్కువ సమయం బయటే గడుపుతూ ఉండేవాడని తెలిసింది.గురువారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో శివాజీ నగర్ మార్కెట్ ప్రాంతంలో రాధాకృష్ణ అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు అక్కడి కూరగాయల వ్యాపారి గుర్తించాడు. వెంటనే ఆయన పెద్ద కుమారుడు రావులపల్లి లక్ష్మణ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న లక్ష్మణ్ వెంటనే ఘటన స్థలానికి చేరుకుని తండ్రిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.అనంతరం స్థానికుల సహాయంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగి స్తున్నారు. రాధాకృష్ణ మృతి వడదెబ్బ కారణంగా జరిగిందా..? లేక మరే ఇతర కారణాలు న్నాయా..? అనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం మృతికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు.ఈ ఘటన బాపూజీ నగర్ ప్రాంతంలో విషాద ఛాయలు నింపగా, మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి

## ఆధునిక భారత నిర్మాతకు కరీంనగర్ కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి






**కరీంనగర్ బ్యూరో, మే 21 (జనంసాక్షి) :**
దేశానికి కంప్యూటర్, టెలికాం, ఐటీ విప్లవాన్ని పరిచయం చేసిన దార్శనికుడు, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన యువనేత, మాజీ ప్రధానమంత్రి భారతరత్న రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ అర్బన్ డీసీసీ కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, కార్పొరేటర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ సంఘాల నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ... 21వ శతాబ్దపు భారతదేశాన్ని ఊహించి, దానికి పునాదులు వేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ. 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించి, దేశ భవిష్యత్తును యువత చేతుల్లో పెట్టారు. పంచాయతీరాజ్ చట్టం ద్వారా మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించి గ్రామస్వరాజ్యానికి బాటలు వేశారు. దేశంలో ఐటీ, టెలికాం రంగాలకు ఆయనే ఆద్యుడు. నేడు మనం చేతిలో పట్టుకున్న మొబైల్, ఇంట్లో ఉన్న కంప్యూటర్ రాజీవ్ దూరదృష్టికి నిదర్శనం అని కొనియాడారు. శాంతి, సమైక్యత, అభివృద్ధి కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరజీవి రాజీవ్ గాంధీ అని ఆయన ఆశయాల సాధన కోసం, రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోంది. నేటి యువత రాజీవ్ ఆలోచనలను, త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు 2 నిమిషాలు మౌనం పాటించి రాజీవ్ గాంధీ కి శ్రద్ధాంజలి ఘటించారు.

**కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు..**
వృద్ధుల, వికలాంగుల హాస్టల్‌లో పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు పంపిణీ చేశారు. రాజీవ్ నగర్‌లో విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి, అనంతరం చిన్న పిల్లలకు పండ్లు, బిస్కెట్లు, స్వీట్లు, పేదలకు పంపిణీ చేశారు. రాజీవ్ చౌక్‌లో చల్ల ప్యాకెట్ల పంపిణీ చేశారు. వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాకా, మౌలానా అబ్దుల్ కలాం చౌరస్తాలో చల్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేకర్, రాజీవ్స్ చైర్మన్ మడుపు మోహన్, కార్పొరేటర్లు వరాల నర్సింగ్, జగన్ రెడ్డి, గంట శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు గుంట కళ్యాణి, చడగుండ సరళ, ప్రసాద్, మాచర్ల ప్రసాద్, మర్కరాజు కంకణాల అనిల్, మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో బదిలీలలో అవినీతిపై సీబీఐ ఏసీబీ విచారణ జరపాలి

## అర్హులైన ఉద్యోగులకు న్యాయం చేయాలి : డి వై ఎఫ్ ఐ

**కరీంనగర్ టౌన్, మే 21,(జనం సాక్షి)**
డి వై ఎఫ్ ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో బదిలీల ప్రక్రియలో అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డి వై ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్ పటేల్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.ఏం.ఎస్.నెంబర్.38 ద్వారా బదిలీల నిషేధాన్ని ఎత్తివేసి 2026 మే 1 నుండి 31 వరకు షెడ్యూల్ ప్రకటించినప్పటికీ, ఎస్సీ?ఎస్టీ సంక్షేమ శాఖల్లో బదిలీల అమలు అనుమానాస్పదంగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కొందరు ఉద్యోగులు అక్రమ మార్గాల్లో బదిలీల నుంచి తప్పించుకుంటున్నారని, అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. ఒకే స్థానంలో నాలుగు సంవత్సరాలకు పైగా పనిచేసిన ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉన్నప్పటికీ, జిల్లాలో కొందరు ఉద్యోగులు 8 నుంచి 10 సంవత్సరాలుగా ఒకే చోట కొనసాగుతున్నారని ఆయన పేర్కొన్నారు. సాధారణ ఉద్యోగులకు ఒక న్యాయం, పలుకుబడి ఉన్నవారికి మరో న్యాయం అమలవుతోందని ఆయన ఆరోపించారు. టీఎన్‌జీఓల లేఖలు, రాజకీయ సిఫారసులు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో పాటు డబ్బు లావాదేవీల ద్వారా కూడా బదిలీల జాబితాల్లో మార్పులు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం మౌనం వహించడం మరింత అనుమానాలకు తావిస్తోందని అన్నారు. అదేవిధంగా సెన్సస్ ఎన్యూమరేటర్ నియామక ఉత్తర్వుల్లో తేదీల విషయంలో గందరగోళం ఉందని, నియామక ఉత్తర్వు కంటే ముందే శిక్షణ జరిగినట్లు నమోదు కావడం పై కూడా సమగ్ర విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది పరిపాలనా పొరపాటా లేదా ప్రత్యేక మినహాయింపుల కోసం రూపొందించిన వ్యవస్థనా అనే అంశాన్ని తేల్చాలని కోరారు. కొంతమంది ఉద్యోగులకు స్పౌస్ గ్రౌండ్స్, ప్రత్యేక విధులు, సెన్సస్ డ్యూటీలు వంటి కారణాలతో పదేపదే మినహాయింపులు ఇస్తున్నారని, ఇది నిజాయితీగా పనిచేసే ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. స్పౌస్ గ్రౌండ్స్‌ను దుర్వినియోగం చేసి మూడోసారి కూడా ప్రయోజనం పొందే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నకిలీ ధ్రువపత్రాలు, తప్పుడు వైద్య సర్టిఫికెట్లు, రాజకీయ ఒత్తిళ్లు, మధ్యవర్తుల జోక్యం వంటి అంశాలపై సీబీఐ లేదా ఏసీబీతో స్వతంత్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. బాధ్యులైన ఉద్యోగులు, అధికారులు, మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అవినీతిపై చర్యలు తీసుకోకపోతే డి వై ఎఫ్ ఐ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు శివ కుమార్, నగర అధ్యక్షులు అకల్ సింగ్, నాయకులు అజేయ్, చందు, భూమేష్, శ్రీనివాస్ రెడ్డి, మహ్మద్ కలీల్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.




# టీజీఎన్పీడీసీఎల్‌లో వన్ మినిట్ రూల్ అమలు

## సిబ్బంది భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం

**కరీంనగర్ టౌన్, మే 21, ( జనంసాక్షి)**
కరీంనగర్ సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ టీజీఎన్పీడీసీఎల్ కొత్తగా వన్ మినిట్ రూల్ అనే ప్రత్యేక భద్రతా విధానాన్ని అమలు చేస్తున్నట్లు సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ తెలిపారు.
క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించే ముందు ప్రతి ఉద్యోగి కేవలం ఒక నిమిషం సమయం తీసుకుని భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని రూపొందించినట్లు ఆయన వివరించారు. విద్యుత్ ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం, సిబ్బంది ప్రాణాలను కాపాడడం, అలాగే విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత సురక్షితంగా నిర్వహించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలని ఆయన పేర్కొన్నారు. ఈ వన్ మినిట్ రూల్ విధానాన్ని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆలోచనతో ప్రవేశపెట్టినట్లు ఎస్ఈ రవీందర్ తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉన్నందున, ప్రతి పనికి ముందు ఒక్క నిమిషం జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కొత్త భద్రతా విధానంపై సిబ్బంది సానుకూలంగా స్పందిస్తున్నారని, ఇప్పటికే విస్తృత అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అన్ని స్థాయిల్లో ఉద్యోగులు ఈ నియమాన్ని తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వన్ మినిట్ రూల్ లో భాగంగా ఉద్యోగులు తప్పనిసరిగా కొన్ని ముఖ్యమైన భద్రతా అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది.
వాటిలో లైన్ క్లియర్ పొందిన విషయాన్ని నిర్ధారించుకోవడం, ఇండక్షన్ టెస్టర్‌తో విద్యుత్ సరఫరా లేదని పరీక్షించడం, వ్యక్తిగత రక్షణ పరికరాలు సరిగా ధరించడం, ఎర్తింగ్ వ్యవస్థ సక్రమంగా ఉందో లేదో తనిఖీ చేయడం వంటి అంశాలు ఉన్నాయి. అలాగే పని ప్రదేశంలో ఇతర ప్రమాదాల అవకాశాలు ఉన్నాయా అన్నది పరిశీలించడం, డబుల్ ఫీడింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం, టీమ్ సభ్యుల అప్రమత్తతను నిర్ధారించుకోవడం, పరికరాల భద్రతను తనిఖీ చేయడం కూడా ఇందులో భాగమని వివరించారు. సిబ్బంది భద్రతే ప్రధాన లక్ష్యంగా టీజీఎన్పీడీసీఎల్ ఈ విధానాన్ని అమలు చేస్తోందని ఎస్ఈ రవీందర్ తెలిపారు. ఒక్క నిమిషం ఆలోచన ? జీవితాంతం భద్రత అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని మరింత బలంగా అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# పెట్రోల్, డీజిల్, సి ఎన్ జీ ధరలు తగ్గించాలని 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

**కరీంనగర్ టౌన్, మే 21, ( జనంసాక్షి)**
కరీంనగర్ జిల్లా పబ్లిక్ ఢ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, సి ఎన్ జీ గ్యాస్ ధరలు తగ్గించాలని, అలాగే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ తెలంగాణ చౌక్ గీత భవన్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ జిల్లా అధ్యక్షులు పున్నం రవి మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం దేశంలో ఇంధన ధరలను పెంచి సామాన్య ప్రజలపై అదనపు భారం మోపుతోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రజల జేబులు ఖాళీ చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్‌పై ధరలు పెంచిన కేంద్ర ప్రభుత్వం, ఆ తరువాత కూడా వరుసగా పెంపులు చేస్తూ నాలుగు రోజుల వ్యవధిలోనే పెట్రోల్, డీజిల్‌పై సుమారు 4 రూపాయల వరకు పెంచిందని ఆయన పేర్కొన్నారు. అలాగే గ్యాస్ ధరలను కూడా పెంచడంతో ఆటో, ట్రాలీ, క్యాబ్ డ్రైవర్లు వంటి రవాణా రంగ కార్మికుల జీవనం తీవ్రంగా దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా రంగంపై పెరుగుతున్న ఇంధన భారంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గిరాకీ తగ్గడంతో వారి జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆయన అన్నారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తోందని విమర్శించారు. ఇవి కార్మికుల హక్కులను హరిస్తున్నాయని, వెంటనే వాటిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఫ్రీ బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లకు తీవ్ర నష్టం జరుగుతోందని, ఇప్పటికే వందలాది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో, టాటా ఏసీ వాహనాలకు గిరాకీ లేక కార్మికులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ములిగే నక్క మీద తాటిపండు పడినట్లుగా మారాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెలికాని శ్రీనివాస్, ఎం.డి. షాబుద్దీన్, బోటుక ఐలేష్, కాల్వ కిషన్, ఉడికందుల ఐలేష్, కొమురయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ కి ఘన నివాళులు





**మల్లాపూర్, మే22(జనంసాక్షి)**
మండల కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ35వ,వర్ధంతి కార్యక్రమంనిర్వహించరు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జవ్వాడి కృష్ణారావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలా జలపతి రెడ్డి పాల్గొని ఘన నివాళులర్పించి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసారు. అనంతరం పెద్దమ్మ ఆలయం కి వెళ్లి పెద్దమ్మ తల్లి పున ప్రతిష్ట ప్రారంభోత్సవంలో పాల్గొనడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మల్లాపూర్ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాట్ల సోమయ్య, మాజీ ఎంపీపీ బద్దం బద్దం విజయ నర్సారెడ్డి , గొండ రాజేందర్,సిరిపూర్ రవీందర్, బొల్లం రఘు,బండారి రమేష్, ముదిరాజ్ సంఘ నాయకులు,అన్ని గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్లు నాయకులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఎమ్మార్వో కు వినతి పత్రం



**మల్లాపూర్ , మే 21(జనంసాక్షి)**
మండల కేంద్రం లోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న తీవ్ర జాప్యం, మౌలిక వసతుల లేమి, 'తరుగు– తేమ' పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టి, యుద్ధప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ (ఃఏఖ) తరపున మండల తాసిల్దారు కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వాకిటి తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు ముష్కిరి రాజ్ కుమార్, భారతీయ జనతా పార్టీ మండల కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



## పచ్చిరొట్ట ఎరువులు, పంట మార్పిడితోనే నేల ఆరోగ్యం కాపాడుకోవచ్చు

**ముస్తాబాద్ మే 21 (జనంసాక్షి)**
రైతులు భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేయడం, పప్పు జాతి పంటలతో పంట మార్పిడి, పచ్చిరొట్ట ఎరువుల సాగు ద్వారా అధిక దిగుబడితోపాటు నేల ఆరోగ్యాన్ని కూడా పెంచుకోవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిరిసిల్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ పి మాధవి, రైతులకు సూచించారు. కొండాపూర్ గ్రామం లో ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా, డాక్టర్ పి మాధవి మాట్లాడుతూ భూసార పరీక్షలు తోపాటు సాగు నీటి పరీక్ష ప్రతి రైతు చేసుకోవాలని, మట్టి నమూనా ఎలా తీసుకోవాలో వివరించారు. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తూ, బావి తరాలకు సారవంతమైన నేలలను అందించాలని సూచించారు. రైతులకు రైతులు వరి పంటలో సన్న రకాలను సాగు చేయవచ్చని, ఆర్ఎన్ఆర్ 15048, 1638,, జైశ్రీరామ్ వంటి రకాలను సాగు చేయవచ్చు అని రైతులకు డా. ప్రీతిక సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను పండించి అధిక ఆదాయం పొందవచన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేంద్ర రెడ్డి, ఉపసర్పంచ్ పరుషరాములు, ఏవో అనూష, ఏఈఓ అఖిల, కళాశాల విద్యార్థులు ఆదిత్య, నిఖిల్, రైతులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ తనిఖీ..



**ముత్తారం మే 21(జనంసాక్షి):** 108 అంబులెన్స్ ను ముత్తారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఆసుపత్రి ఆవరణలో తెలంగాణ రాష్ట్ర అత్యవసర సరిస్సు ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ సంస్థ క్యాలిటి అడిట్ కంట్రోలర్ ఫయాజ్ గురువారం తనిఖీ చేశారు.అంబులెన్స్ లో ఉన్న పరికరాల నిర్వహణ,మందుల లభ్యత,ఆక్సిజన్ నిల్వలను పరిశీలించడంతో పాటు నెలవారి కేసుల సగటు పై ఆరా తీశారు.అందుబాటులో ఉండడమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లో ఆసుపత్రులకు చేర్చాలని సూచించారు.ఈ తనిఖీల్లో 108పెద్దపెల్లి జిల్లా కో ఆర్డినేటర్ జంపాల కుమారస్వామి, ముత్తారం అంబులెన్సు సిబ్బంది,ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ప్రశాంత్, పెయిలెట్ రాజేందర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు

## గ్రామంలో నీటి సమస్యను తీర్చిన గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ



**ముస్తాబాద్ మే 21 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ, నవీన్ ఆధ్వర్యంలో తెర్లుమద్ది గ్రామ 5వ వార్డులో నెలకొన్న నీటి సమస్యకు తక్షణ పరిష్కారం లభించింది. కాలనీవాసులు నీటి సమస్య గురించి సర్పంచ్ బైతి దుర్గమ్మ గారికి సమాచారం అందించగా, సర్పంచ్ బైతి దుర్గమ్మ వెంటనే పాలకవర్గం , కార్యదర్శి గారి తో చర్చించి సింగిల్ ఫేజ్ మోటారు కొనుగోలు చేసి అందజేశారు. అనంతరం ఆ మోటారును ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బద్ధ రాములు, చిర్రం రమేష్, కొమ్మెట రాజు, కొమ్మెట రాజలింగయ్య, కొండం విష్ణు, జంపెల్లి తిరుపతి, మామిండ్ల కానుకవ్వ శ్రీనివాస్, గోక దివ్య స్వామి, గ్రామ కార్యదర్శి సౌజన్యతో పాటు కాలనీవాసులు శంకర్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధులకు అన్నం పెడుతున్న కూర సావిత్రి

**ముస్తాబాద్ మే 21 (జనం సాక్షి)**
బిజీ బిజీగా ఉండే ఈ రోజుల్లో దానం చేయడంలో వెనుకడుగు వేసే ఈ జనరేషన్ లో ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో అన్నపూర్ణ ఫౌండేషన్ నిర్వాకురాలు కూర సావిత్రి తన సొంత పనులు పక్కకు పెట్టి కొంతమంది మహిళల తోటి మిత్రుల సహకారంతో కలసి గ్రామంలో పూర్తిగా నడవలేని వృద్ధులకు అన్నము వండించి వారి వద్దకు తీసుకువెళ్లి అన్నం అందిస్తున్న అన్నపూర్ణ ఫౌండేషన్ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .

### ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎండపల్లిలో

# ఘనంగా మండల స్థాయి క్రీడా పోటీలు...

**ఎండపల్లి జగిత్యాల జిల్లా జనంసాక్షి :**
ఎండపల్లి మండల కేంద్రంలోని జిఖఉూ ఎండపల్లిలో ఈ రోజున ప్రజా పాలన?ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా యూత్ అండ్ స్పోర్ట్స్ వారోత్సవాల్ల, నేడు మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించ బడ్డాయి.ఈ కార్యక్రమంలో మండలంలోని, మరియు మండల కేంద్రంలోని యువత పెద్ద ఎత్తున పాల్గొని క్రీడా స్పూర్తిని చాటారు.ఈ సందర్భంగా చెస్, క్యారమ్, వాలీబాల్ పోటీలు నిర్వహించగా, 25 సంవత్సరాల లోపు యువకులు ఉత్సాహంగా తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమానికి కన్వీనర్గా ఎండపల్లి మండల ఓఖఆూ శ్రీ కృపాకర్ , కో–ఆర్డినేటర్గా మండల విద్యాశాఖ అధికారి శ్రీ హరికృష్ణ ఎండపల్లి వ్యవహరించారు. మరియు ఈ కార్యక్రమంలో ఎండపల్లి స్థానిక సర్పంచ్ శ్రీమతి మారం సునీత క్రీడలను ప్రారంభించి యువతను, విద్యార్థులను ఉత్సాహపరిచారు. తదుపరి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, క్రీడలు యువతలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడం లో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల వైపు ఆకర్షితులు కావాలని సూచించారు.పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందించి, భవిష్యత్తులో జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.ఇట్టి క్రీడలను ఎండపల్లి మండలంలోని ఎండపల్లి ఉన్నత పాఠశాల మరియు గుల్లకోట ఉన్నత పాఠశాలలో పనిచేయుచున్న వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీమతి కృష్ణవేణి, భూమేష్ గారలు సమర్ధవంతంగా నిర్వహించడం జరిగింది. ఇది తోపాటు స్థానిక గ్రామ కార్యదర్శి కొమురయ్య ఏర్పాట్లను చేయటం జరిగింది.







# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

## వానాకాలానికి రైతులు సిద్ధం కావాలి:శాస్త్రవేత్త డా. ఎస్ రమేష్



**ముత్తారం మే 21(జనంసాక్షి)**
వానాకాలం సాగుకు రైతులు ముందుగానే ప్రణాళికతో సిద్ధమై, శాస్త్రీయ పద్ధతులు అనుసరిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త ఎస్. రమేష్ సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ముత్తారం మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులకు అవసరమైయే ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. యూరియా వినియోగాన్ని తగ్గించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని, అవసరానికి మించిన రసాయనాల వినియోగం నేల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని చెప్పారు.పంట మార్పిడి విధానం పాటిస్తే స్థిరమైన ఆదాయం పొందవచ్చని, మార్కెట్లో లాభసాటిగా ఉన్న వరి రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సాగునీటి వినియోగంలో మితవ్యత పాటించాల్సిన అవసరం ఉందని, ప్రత్యామ్నాయ పంటలు మరియు సేంద్రీయ సాగుపై రైతులు దృష్టి సారించాలని పేర్కొన్నారు.నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పచ్చిరొట్ట ఎరువులైన జిలుగు, జనుము,పిల్లి పెసర విత్తాలని సూచించారు.వానాకాలంలో వరి పంటను నేరుగా విత్తనాలు వెదజల్లి సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలను వినియోగిస్తే పురుగులు,తెగుళ్లు తక్కువగా ఉండి దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి అనూష మాట్లాడుతూ రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని సాగు ఖర్చులు తగ్గించుకోవాలని,సమగ్ర వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కోరారు.ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని, డ్రిప్ సిస్టమ్ మరియు ఆయిల్ పామ్ మొక్కలపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను వినియోగించుకోవాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతుల సందేహాలకు శాస్త్రవేత్త సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుధాటి రవీందర్ రావు, పిఏ సి ఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరి రావు,వ్యవసాయ విస్తరణ అధికారి సౌమ్య తోపాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.





## బోరు మోటర్ కాలిపోవడంతో వెంటనే రిపేర్ చేపించి బిగించిన వార్డు కౌన్సిలర్..

**జమ్మికుంట, మే 21 (జనంసాక్షి):**
జమ్మికుంట మున్సిపాలిటీలోని 7వ వార్డులో రైల్వే ట్రాక్ పక్కన గల బోర్ మోటర్ వైండింగ్ కాలిపోవడంతో రిపేర్ చేపించి బిగించామని వార్డు కౌన్సిలర్ ఎంఏ ఫెరోజ్ ఖాన్ తెలిపారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ఫెరోజ్ ఖాన్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో పెట్టుకొనివార్డులో నీటి సమస్య ప్రతి ఇంట్లో ఉన్నందున ఒక్క రోజులో బోర్ మోటార్ రిపేర్ చేపించి బిగించడం జరిగిందన్నారు. మోటర్ బిగించిన వెంటనే మళ్ళీ స్టార్టర్ కాయిల్స్ కాలిపోవడంతో అవి కూడా రిపేర్ చేపించడం జరిగిందన్నారు. వార్డు ప్రజలు వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ఎండలు తీవ్రంగా కొడుతున్నా తరుణంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి ప్రజల ప్రాణాలకు హాని కలిగించే విధంగా ఉండడంతో అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి కానీ,లేకుంటే బయటకు వెళ్ళరాదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నా నన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది,వార్డు ప్రజలు తదితరులు ఉన్నారు.

# రాజీవ్ గాంధీ వర్ధంతి

**ముస్తాబాద్ మే 21 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్లో రాజీవ్ గాంధీ విగ్రహంగా నికి పూలదడలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లా బాల్ రెడ్డి మాట్లాడుతూ భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.దేశ అభివృద్ధి, సాంకేతిక విప్లవం, యువతకు అవకాశాల కల్పనలో రాజీవ్ గాంధీ గారి సేవలు చిరస్మరణీయమైనవి. ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేసిన మహానేతగా ఆయన ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మెరుగు యాదగిరి గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొండం రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ కిషన్ రావు, కర్ణాకర్ , తలారి నర్సింలు, వైస్ చైర్మన్ రామ్ రెడ్డి, దీటి నరసింహులు,మాజీ ఎంపీటీసీలు గజ్జల రాజు, గుండెలు శ్రీనివాస్, ఉప సర్పంచ్ తాళ్ల విజయ రెడ్డి, రంజాన్ నరేష్, భాను, శీలం ప్రశాంత్, పుల్లూరి రవి, ఆరుట్ల మహేష్, ఎండి సాదుల్ పప్పా, కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.





# బడిబాట కార్యక్రమం

**ముస్తాబాద్ మే 21 (జనంసాక్షి)**
ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బంధనకల్ గ్రామంలో అంగన్వాడి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లులతో సమావేశం నిర్వహించారు.తల్లులందరూ ఉపాధి పనులలో ఉన్నందున అక్కడికే వెళ్లి తల్లులతో సమావేశమై ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి పాఠశాల అభివృద్ధిలో తద్వారా గ్రామాభివృద్ధిలో తల్లుల పాత్ర చాలా కీలకం అని తెలియజేశారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ , వార్డు సభ్యులు వెంకటరెడ్డి , ప్రధానోపాధ్యాయులు రాజ్ కుమార్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ఎన్నికల హామీని నెరవేరుస్తున్న సర్పంచ్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 21 (జనంసాక్షి)**
సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న వేములవాడ అర్బన్ మండలంలోని ఆరెపల్లి గ్రామ సర్పంచ్ రాజు.ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో నేను సర్పంచ్ గా గెలిస్తే గ్రామంలో ఆడపిల్ల పుడితే రూ 10016 ఆడపిల్లలకు కానుకగా ఇస్తానని హమీ ఇచ్చాడు. ఆ హామీలో భాగంగా గురువారం మంజీడి విజయ్ -సహన దంపతులకు జన్మించిన మొదటి ఆడపిల్లకు రూ 10016 కానుక అందచేశారు.అయన వెంట ఉప సర్పంచ్ ప్రశాంత్, కిసాన్ మోర్చా అధ్యక్షులు లింగయ్య వార్డు సభ్యులు ప్రశాంత్,శ్రీనివాస్, దేవేంద్ర,పావని,ఉమారాణి పాల్గొన్నారు.



## చిన్నారులను అంగన్వాడీలో చేర్పించాలి
## మండల విద్యాధికారి నిమ్మరాజు రెడ్డి

**ముస్తాబాదు మే 21 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో , మండల విద్యాధికారి నిమ్మ రాజిరెడ్డి అంగనవాడి టీచర్లకు పిలుపునిచ్చారు అంగన్వాడి టీచర్లతో మండల విద్యాధికారి నిమ్మ రాజిరెడ్డి గురువారము సమావేశం నిర్వహించారు. సమావేశంలో మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లను అంగన్వాడీలో ఉండాలని ఐదు సంవత్సరాలు పూర్తయిన వారు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలనారు బడి బయట పిల్లలు ఎవరు కూడా జూన్ తర్వాత ఉండకూడదని సూచించారు కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ రు పద్మ , స్రవంతి,జయలక్ష్మి ,అనురాధ ,ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 21 (జనంసాక్షి)**
భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు గురువారం వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్ తూము మధు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనకు నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు తూము మధు, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజులు మాట్లాడుతూ దేశ సాంకేతిక,సామాజిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన మహోన్నత నాయకుడు రాజీవ్ గాంధీ అన్నారు.ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు. దేశ ప్రగతి కోసం ఆయన చేసిన త్యాగాలు వృథా పోనివ్వబోమన్నారు. భారతదేశాన్ని ఆధునిక ప్రపంచం వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ పోషించిన పాత్ర చారిత్రాత్మకమైనదన్నారు.దేశంలో నేడు మనం చూస్తున్న సమాచార సాంకేతిక ఐటీ రంగ అభివృద్ధికి, టెలికాం విప్లవానికి రాజీవ్ గాంధీ అప్పట్లోనే పునాది వేశారన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందనే నమ్మకంతో ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించి దేశ రాజకీయాల్లో యువతకు పెద్దపీట వేశారన్నారు. అధికార వికేంద్రీకరణ ద్వారా గ్రామీణ ప్రాంతాలు స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి ఆయన ఎనలేని కృషి చేశారని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత వసతితో కూడిన విద్యను అందించడం కోసం దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు ఏల శ్రీనివాస్,కొక్కుల బాలకృష్ణ,కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగరం వెంకటస్వామి, చిలుక రమేష్, కూరగాయల కొమురయ్య, పీర్ మొహమ్మద్, దుర్గం పరశురాం తో పాటు పలువురు పాల్గొన్నారు.



## టీజీ-ఈఏపీసెట్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన

# ముక్రమ్ అహ్మద్‌కు షబ్బీర్ అలీ అభినందనలు

**కామారెడ్డి ప్రతినిధి, మే 21 (జనంసాక్షి)**

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ గురువారం సచివాలయంలోని తన కార్యాలయ ఛాంబర్‌లోకామారెడ్డికి చెందిన టీజీ?ఈఏపీసెట్ (వ్యవసాయ ఫార్మసీ విభాగం)లో రాష్ట్ర స్థాయిలో ఓవరాల్ ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థి ముక్రమ్ అహ్మద్‌ను ఘనంగా అభినందించారు.టీఎంఆర్ఈఐఎస్‌కు చెందిన ముక్రమ్ అహ్మద్ 150.17 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల షబ్బీర్ అలీ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి ప్రతిభ, కృషి, క్రమశిక్షణకు ఇది నిదర్శనమని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నత విద్యతో పాటు వృత్తి జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణానికి చెందిన మైనార్టీ ఇతర విద్యార్థుల ప్రతిభను కూడా షబ్బీర్ అలీ ప్రశంసించారు.అస్మా జుబిన్ బైపీసీ?2 విభాగంలో రాష్ట్ర ద్వితీయ ర్యాంకు, షారికా ముస్కాన్ బైపీసీ?2లో రాష్ట్ర తృతీయ ర్యాంకు, హురాయా దిల్సాత్ ఎంపీసీ?1లో రాష్ట్ర తృతీయ ర్యాంకు, ఆయేషా సిద్ధిఖా బైపీసీ?1లో రాష్ట్ర తృతీయ ర్యాంకు, అఫియా తబ్బుస్సుమ్ బైపీసీ?1లో రాష్ట్ర నాల్గవ ర్యాంకు సాధించడం పట్ల అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ...ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాల



సాధనలో ఇదే పట్టుదలతో ముందుకు సాగి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్య ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఉరి వేసుకొని

# యువకుడు మృతి



**జనంసాక్షి రాయికల్ :**

రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన మంగళారపు లక్ష్మణ్ తండ్రి లింగన్న 29 సంవత్సరాలు అనునతను గత కొంతకాలంగా స్థిరమైన ఉద్యోగం లేనందు వల్ల పెళ్లి సంబంధాలు కుదరక డిప్రెషన్కు లోనై జీవితంపై విరక్తి చెంది బుధవారం రోజున రాత్రి సమయంలో ఉరి వేసుకుని చనిపోయాడని మృతుని తండ్రి మంగళారపు లింగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏ ఎస్ ఐ దేవేందర్ తెలిపారు.



# గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు..

## వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం

**వేములవాడ రూరల్, మే 21 (జనంసాక్షి):**

మండల పరిధిలోని పలు గ్రామాలలో గురువారం ఎస్ఐ వెంకట్రాజం ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు నార్కోటిక్ జాగిలంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టడమే ధ్యేయంగా ఈ తనిఖీలు చేపట్టారు.?గ్రామాల్లోని కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, బస్టాండ్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, వారి బ్యాగులను తనిఖీ చేయడంతో పాటు స్థానిక ప్రజలకు మత్తు పదార్థాల వలసలపై అవగాహన కల్పించారు.?ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు వ్యతిరేకంగా ప్రజలంతా కలిసిరావాలని, ప్రజల సహకారంతోనే పూర్తిస్థాయిలో వీటి నిర్మూలన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

**రుద్రంగి మే 21 (జనంసాక్షి)**

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రుద్రంగి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రం గంగానర్సయ్య ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నిరుపేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గారిబి హటావో అనే నినాదంతో దేశాన్ని ముందుకు నడిపించారని అన్నారు. ఇప్పుడు ఉన్న ఉపాధిహామీ పథకం కూడా రాజీవ్ గాంధీ గరే ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.ఐటి రంగాన్ని అభివృద్ధి చేసింది కూడా రాజీవ్ గాంధే అని అన్నారు.ఈ కార్యక్రమంలో,సర్పంచ్ గండి నారాయణ,మాజీ జడ్పిటిసి గట్ల మీనయ్య,గడ్డం శ్రీనివాస్,తర్రె మనోహర్,కేసిరెడ్డి నర్సారెడ్డి,తర్రె లింగం,గుగ్గిళ్ల వెంకటేష్,గంధం మనోజ్,కట్కూరి దాసు,ఎర్రం అరవింద్,ద్యావల రవి,సనుగుల గంగాధర్,లావుడ్యా సతీష్,,దయ్యాల శ్రీనివాస్,చెలుకల శ్రీకాంత్,శీలం మీనయ్య,పున్నూరి శ్రీనివాస్,దువ్వక సత్తయ్య,రొమాల అశోక్,పుదరి ప్రశాంత్,తర్రె సుదర్శన్,తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు

**మంథని, ( జనంసాక్షి ) :**

పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని అంగడి బజారులో శ్రీలక్ష్మి, భూలక్ష్మి సహిత బొడ్రాయి 3వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రొచ్చారాణాల మధ్య సంప్రదాయ పద్దతిలో దేవత మూర్తుల విగ్రహాలకు అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన ఆదివరాహ స్వామి దేవస్థానం చైర్మన్ దామోదం



**మంథని, ( జనంసాక్షి ) :**

రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను కమాన్ పూర్ ఆదివరాహ స్వామి దేవస్థానం చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఆలయ ఈవో కాంత రెడ్డి లు గురువారం కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్బంగా ఆదివరాహ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబును కోరగా మంత్రి శ్రీధర్ బాబు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన మండల అధ్యక్షులు సయ్యద్ అన్వర్

**మంథని,(జనంసాక్షి) :**



రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను కాంగ్రెస్ పార్టీ కమాన్ పూర్ మండల అధ్యక్షులు సయ్యద్ అన్వర్ గురువారం కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

## ఘనంగా ప్రారంభమైన

# సరస్వతి నది అంత్య పుష్కరాలు



**మంథని, (జనంసాక్షి) :**

కాళేశ్వరం వద్ద నిర్వహిస్తున్న సరస్వతి నది అంత్య పుష్కరాలు నేడు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పుష్కరాల తొలి రోజు గురువారం ఉదయం 5:43 గంటలకు పవిత్ర త్రివేణి సంగమంలో తొలి పుష్కర స్నానం ఘనంగా జరిగింది. ఈ పుణ్యస్నానాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వాములు, మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ ఆచరించి అంత్యపుష్కరాలను ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తెలంగాణ దేవాదాయ శాఖ తరపున విస్తృత ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖలు తెలిపారు. అన్ని వసతులతో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, స్నానానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ పవిత్ర పుష్కరాల్లో పాల్గొనే ప్రతి భక్తుడికి దైవ అనుగ్రహం కలగాలని వారు కోరుకున్నారు. జూన్ ఒకటవ తేదీ వరకు జరిగే ఈ సరస్వతి అంత్య పుష్కరాల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి

**చొప్పదండి, మే 21 (జనం సాక్షి ):**

భారత మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి నీ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. చొప్పదండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నిజానపురం చందు ఆద్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశంలో టెలికాం రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకునన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ్,కౌన్సిలర్ ఫోరం అధ్యక్షులు గుర్రం సుజీత్ రెడ్డి కౌన్సిలర్స్ గుర్రం రాజేందర్ రెడ్డి,కనుమళ్ళ రాజశేఖర్, వడ్లూరి అనుష శ్యామ్ సుందర్,మార్కెట్ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్,నాయకులు గుర్రం రమేష్ గౌడ్,కడారి శంకర్,మావూరపు రాములు,ఉప సర్పంచ్ మరం శ్రీనివాస్(టోని), దూస కైలాసపతి,మహేషుని మల్లేశం, మారు తిరుపతి రెడ్డి,మహిళా నాయకురాలు చిలుముల స్వప్న, గుంటి స్వరూప,సోమిడి శ్రీనివాస్, కళ్యాణపు శ్రీనివాస్,గుర్రం రాజేందర్ రెడ్డి నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి

### ఆధునిక భారత స్వప్నికుడు సంస్కరణల సృష్టికర్త రాజీవ్ గాంధీ

**కమ్మర్పల్లి మే 21(జనంసాక్షి)**
భారత రత్న భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం రోజున మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చూపిన బాట నేడు ప్రతి ఒక్కరూ ఎంతో స్ఫూర్తిదాయకంతో తీసుకోవాలని సూచించారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకువచ్చిన వ్యక్తి ఆయనని ఆయన సేవలను దేశం ఎన్నటికీ మరువదని కొనియడారు. ఆనాడే ఐటీ రంగాన్నీ,టెలి కమ్యూనికేషన్, సాంకేతికత, గ్రామీణ అభివృద్ధి,ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి మూల స్తంభాలని చెప్పినా గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని గుర్తు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్,మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నర్సయ్య,వైస్ చైర్మన్ బుచ్చన్న, మాజీ మండల అధ్యక్షుడు సుంకేట రవి,డిసిసి నాయకులు మురళి,తిప్పి రెడ్డి శ్రీనివాస్,తక్కురి దేవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సల్లూరి గణేష్ గౌడ్,అల్లకుంట రాజేష్,వన్నెల రాజేశ్వర్,నిమ్మ రాజేంద్రప్రసాద్,అజ్మీత్ పాషా, సంపంగి నాగరాజు, గణేష్,సుమన్,విజయ్,నరేష్,అజార్ తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుడిని సన్మానించిన సర్పంచ్ లు

**రుద్రంగి మే 21 (జనంసాక్షి)**
రుద్రంగి మండల నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన ఎర్రం గంగ నరసయ్యను మడిమానాల సర్పంచులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ మండల సమస్యల పట్ల పార్టీ పక్షాన పోరాడి కార్యకర్తల కు మనోధైర్యం ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ అభివృద్ధి పనులు జరుగుతున్నందున మండలంలోని అన్ని గ్రామాలలో సంక్షేమానికి అభివృద్ధికి పాటుపడాలని నూతనంగా ఎన్నికైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు నాయకులు కిషన్ రాజు గంగాధర్ గురుదాస్ తదితరులు ఉన్నారు.

### ఘనంగా పెద్దమ్మ తల్లి పునః ప్రతిష్టాపన కార్యక్రమం



**మల్లాపూర్ మే 22(జనం సాక్షి)**
పెద్దమ్మ తల్లివిగ్రహ పునఃప్రతిష్టాపన" మరియు "బోనాల" మహోత్సవం మల్లాపూర్ మండల కేంద్రం లో ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవం గా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో మల్లాపూర్ ప్రజలందరూ పాడి పంటలతో శు బీక్షం గా ఉండాలని ఆ అమ్మ వారిని ప్రార్తించానని అన్నారు. ఈ కార్యక్రమం లో ముదిరాజ్ కులస్తులు,ఉప సర్పంచ్ సోమరెడ్డి, వార్డు సభ్యులు ముష్కరి రమేష్, కొంపెల్లి రాకేష్, భుక్యా శేఖర్, ముత్యాల గంగా రాజం, అరికుప్పల చిన్న రాజం, షబ్బీర్, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ అన్వర్

**మంథని, ( జనంసాక్షి ) :**
రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను కాంగ్రెస్ పార్టీ కమాన్ పూర్ మండల అధ్యక్షులు సయ్యద్ అన్వర్ గురువారం కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వారితో పాటు కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీటీసీ పిల్లి శేఖర్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్యాల మహేష్ గౌడ్, సయ్యద్ ఇక్బాల్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు మహమ్మద్ యూసుఫ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కుక్క రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ శివప్రతాప్ శుక్లాను శాలువాతో సత్కరించిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు

**మంథని, ( జనంసాక్షి ) :**
తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పవిత్ర సరస్వతి అంత్య పుష్కరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.



పుష్కరాల తొలి రోజు సందర్భంగా కాలేశ్వర త్రివేణి సంగమ క్షేత్రానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ కి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎల్లే రామ్మూర్తి, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, సర్పంచ్ వనం రామచంద్రరావు, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, ఎరుకల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజుల్లో దాన్యం సేకరణ పూర్తి చేయాలి

### వరి ధాన్యం కొనుగోలు సెంటర్లను సందర్శించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు




**చిగురుమామిడి మే21(జనంసాక్షి):**
వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన తూకం వేసి మిల్లర్లకు తరలించాలని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,తహసిల్దార్ ముద్దసాని రమేష్,ఎంపీడీవో విజయ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని కొండాపూర్, నవాబుపేట ,ఇందుర్తి,ఓగులాపూర్, ముల్కనూర్,ముదిమాణిక్యం గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు సెంటర్లను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం దిగుమతిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని,హమాలీలు,రైతుల సహకారంతో ప్రభుత్వ లక్ష్యానికి అనుకూలంగా మూడు రోజుల్లో సెంటర్లను క్లోజ్ చేయాలని తెలిపారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధాన్యం కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్,సర్పంచ్ లు చింతపుల నరేందర్,గడ్డం రమాదేవి శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లై డిటిఎస్ విజయకుమార్, సివిల్ సప్లై ఫుడ్ ఇన్స్పెక్టర్ అన్వర్ కహాన్,సింగిల్ విండో డైరెక్టర్ కూతురు రవీందర్ రెడ్డి, ఐకెపి ఏపీఎం శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గీకురు రవీందర్, సాంబారి బాబు,బడుకోలు దేవేందర్ రెడ్డి,చిట్టుమల్ల రవీందర్,ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,ఆర్ఐ నాగరాజు, డీసీఎంఎస్ నిర్వాహకులు చీల లక్ష్మారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఉపసర్పంచ్లు చింతపూల అనిల్ కుమార్,బింగి రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## వీణవంక లో పలు వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులు అరెస్టు ఎస్ఐ ఆవుల తిరుపతి




**వీణవంక మే 21(జనం సాక్షి)**
వీణవంక పరిసర ప్రాంతాలలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని,వారి వద్ద నుండి చోరీ సొత్తు,నేరాలకు ఉపయోగించిన వాహనం,మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం,చల్లా శ్రీకాంత్ 31, జమ్మికుంట మండల కేంద్రంలోని కృష్ణ కాలనీ చెందిన ఇతను ఇంటర్మీడియట్ వరకు చదివి ప్రస్తుతం మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ అవసరాలు జల్సాలకు డబ్బులు సరిపోకపోవడంతో,తనకు పరిచయం ఉన్న మిరియాల భాస్కర్,హసన్పర్తి మండలంలోని భీమారం గ్రామానికి చెందిన గాజె సాయిచందుతో కలిసి పలు చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడించాడు. మిరియాల భాస్కర్ ఇప్పటికే పలు చోరీ కేసుల్లో పాల్గొని,చోరీ చేసిన బంగారు నగలను ఫైనాన్స్ సంస్థల్లో కుదువ పెట్టి డబ్బులు పొందుతూ జల్సాలు చేస్తుండేవాడు. పోలీసులకు అనుమానం రాకుండా ఉండేందుకు,చోరీ సొత్తును శ్రీకాంత్, సాయిచందు పేర్లపై ఉన్న ఆధార్ కార్డులతో ఐ ఎఫ్ ఎల్,ముత్తూట్ ఫిన్‌కార్ప్,క్యాప్రి గోల్డ్ లోన్ వంటి సంస్థల్లో ఇట్టి బంగారాన్ని కుదువ పెట్టి రుణాలు తీసుకునేవారని తెలిసింది. వీణవంక, హుజూరాబాద్, జమ్మికుంట మండలా ల్లోని పరిసర గ్రామాల్లో ఒంటరిగా ఉన్న ఇళ్లు, వృద్ధులు, వేసవిలో బయట నిద్రించే వారిని లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడేవారని పోలీసులు తెలిపారు. ముందుగా శ్రీకాంత్, సాయిచందు తమ షైన్ మోటార్ సైకిల్ నంబర్ యూ-02-ఈఇ-3334 పై తిరుగుతూ రెక్కీ నిర్వహించి,సమాచారం భాస్కర్‌కు అందించేవారు. అనంతరం ముగ్గురు కలిసి రాత్రి వేళల్లో చోరీలు చేసేవారు. చోరీ చేసిన బంగారాన్ని ఫైనాన్స్ సంస్థల్లో కుదువ పెట్టి వచ్చిన డబ్బులను ముగ్గురు పంచుకునేవారు. ఇట్టి సమాచారం చేదించిన పోలీసులకు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి, క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ మోహన్, కానిస్టేబుల్ శ్రీధర్,కోమల్,రఘుపతి లను ఉన్నతధికారులు అభినందించారు. ప్రస్తుత సమాజంలో యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి సులభంగా డబ్బును సంపాదించాలని దొంగతనాలకు దోపిడీలకు పాల్పడుతున్నారు,యువత సరైన మార్గంలో నడవాలంటే తల్లిదండ్రులు ముఖ్యపాత్ర ఉంటుందని ఈ సందర్భంగా సందర్భంలో ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. యువత చెడు మార్గాలను ఎంచుకుంటే వారి పైన తప్పకుండా చట్టరీత్యా చర్యలు తీసుకోబడును అని తెలియజేశారు. మరిన్ని చోరీ కేసులపై విచారణ కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.